www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
21.01.2023
సంపుటి:2 సంచిక:91

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక



## సిటీ కేంద్రంగా 'హై'రైజ్
- శరవేగంతో విస్తరిస్తున్న ఆకాశహర్మ్యాలు
- విదేశీ తరహాలో హైరైజ్ కల్చర్‌కు సిటీ జనాలు అట్రాక్ట్
- వచ్చే ఐదేళ్లలో భారీగా ఆకాశన్నంటే భవనాలు

..మిగతా 3 లో

## ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపుల కేసులో పురోగతి..

- కువైట్‌కు చెందిన మహమ్మద్ ఖాసీంగా గుర్తింపు
- లుకౌట్‌నోటీస్ జారీ చేసిన సైబర్‌క్రైమ్‌పోలీసులు



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

గోషామహల్ ఎమ్మెల్యే, బీజేపీ నేత టి. రాజా సింగ్‌కు బెదిరింపు కాల్స్ చేస్తున్న వ్యక్తిపై సైబర్ క్రైమ్ పోలీసులు లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తనను ఫోన్‌లో బెదిరిస్తున్నారని, హత్య చేయాలని ప్లాన్ చేస్తున్నారని రాజా సింగ్ ఇటీవల పోలీసులకు కంప్లైంట్ చేశారు. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి కాల్స్ వస్తున్నాయని చెప్పారు. దీనిపై రాజాసింగ్ పలుమార్లు పోలీసులకు

..మిగతా 2 లో

## శ్రీరంగం ఆలయంలో ప్రధాని మోడీ పూజలు

- రామాయణంతో సంబంధమున్న ఆలయాల సందర్శన
- మహావిష్ణు రూపమైన రంగనాథుడికి ప్రార్ధనలు

**విశాల భారతి, నేషనల్‌బ్యూరో:**



తిరుచిరాపల్లి శ్రీరంగంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం సందర్శించారు. తమిళనాడులోని తిరుచి సమీపంలో ఉన్న శ్రీరంగం క్షేత్రం రామాయణంతో ముడిపడి ఉంది. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు పఠించిన కంభ రామాయాణాన్ని ప్రధాని మోడీ ఆలకించారు. తెల్లని ధోవతి, అంగవస్త్రం ధరించి ఆలయంలోకి ప్రవేశించిన ప్రధాని మహావిష్ణు రూపమైన రంగనాథ స్వామివారిని కొద్దిసేపు ప్రార్థించారు. ప్రధానికి ఆలయ మహాద్వారం వద్ద అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ఠాపన ఈ నెల 22న జరగనున్న నేపథ్యంలో ప్రధాని మోడీ ఈ వారంలోనే దక్షిణాదిలో రామాయణంతో సంబంధమున్న సందర్శించిన మూడవ ఆలయమిది. ఈ వారం మొదట్లో ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షిలో ఉన్న శ్రీ వీరభద్ర ఆలయాన్ని సందర్శించారు. రాయాణంలోని జటాయువు వృత్తాంతంతో సంబంధమున్న ఆలయమది. ఆ తర్వాత ఆయన కేరళలోని త్రిసూర్‌లో శ్రీ రామస్వామి ఆలయాన్ని దర్శించారు. శ్రీరాముడు, ఆయన సోదరులు ఈ ఆలయాన్ని సందర్శించినట్లు ప్రతీతి. శ్రీరంగంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో అర్చకులు ప్రధాని మోడీకి వఠారితో ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలోని వైష్ణవ మత గురువు శ్రీ రామానుజార్యులు, చక్రత్తాళ్వార్‌తో సహా ఇతర దేవతామూర్తుల సన్నిధులను ప్రధాని దర్శించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ ఏనుగుకు ఆహారం అందజేసి దీవెనలు అందుకున్నారు.



## కేసీఆర్ పులి అయితే..
## బోనులో బంధిస్తం

### చెట్టుకు వేలాడదీసే బాధ్యత మా కార్యకర్తలది..

- బొక్కబోర్లా పడ్డా.. బీఆర్ఎస్ లీడర్లకు బుద్ధి రాలే
- ఆ పార్టీని బొందపెట్టాలనే రాష్ట్ర ప్రజలు చూస్తున్రు
- కేటీఆర్ అహంకారం అణిచివేసే బాధ్యత నాదే
- ఎంపీ ఎలక్షన్ల తర్వాత గులాబీ పార్టీ ఉండదు
- లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి హాట్ కామెంట్స్

'అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క వేటుకే బొక్క బోర్లా పడ్డరు .. అయినా బీఆర్ఎస్‌నేతలకు బుద్ధి రాలే.. ఇప్పటికైనా కాంగ్రెస్‌పార్టీ శక్తి అర్థమైతలేదా?' అని సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌నేతలను హెచ్చరించారు. లండన్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం ప్రవాస భారతీయుల సమావేశానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీని బొందపెడ్తామని స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. 'ఫిబ్రవరిలో పులి బయటకు వస్తుంది' అని ఇటీవల చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్‌తనదైన శైలిలో రిప్లై ఇచ్చారు. పులి బయటికి వస్తే.. వలలు, బోనులు ఉన్నాయని, పట్టుకొని బోనులో వేసి చెట్టుకు వేళాడదీస్తామని విరుచుకుపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పార్లమెంట్ ఎన్నికల్లోనూ రిపీట్ అవుతాయని.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను వంద మీటర్ల లోతులో బొందపెడతామన్నారు.

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే పలు కంపెనీల తో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ తర్వాత అక్కడ ఉన్న తెలంగాణ వ్యక్తులు, కాంగ్రెస్ అభిమానులతో రేవంత్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ పార్టీపై మండి పడ్డారు. లోక్ సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ చూద్దామన్నా కూడా కనిపించదని రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయానికి రా ష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గుర్తే ఉండదు. ఒక్క ఎన్నిక విషయంలోనే బీఆర్ఎస్ నేతలు బొ క్కబోర్లా పడ్డారు. అయినప్పటికీ ఆ పార్టీ నేతలకు మాత్రం అహంకారం తగ్గలేదు. వారి గర్వం, అహంకారం తగ్గించే బాధ్యత నాదే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైన తర్వాత వారికి భయం పట్టుకుంది. అందుకే ఇలా మాట్లాడుతున్నారని రేవంత్ అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీపడుతూ తెలంగాణను అభివృద్ధిలో అగ్రగ్రామిగా తీర్చిదిద్దుతామని.. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే ఆరు గ్యారెంటీల అమలు దిశగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రభుత్వం ఏర్పాటుచేసి పాలన అందిస్తుంటే బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు.

## కరెంటు బిల్లులు కట్టొద్దు

- కరెంటోళ్లకు సీఎం వీడియో చూపించండి
- కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డి కాబోయే ఏక్‌నాథ్ షిండే
- ఎంపీ ఎలక్షన్ల తర్వాత కాంగ్రెస్, బీజేపీ ఏకమైతయ్
- బీఆర్ఎస్‌ను బొందపెట్టుడేమో.. మీ హామీల సంగతేంది?
- రేవంత్ గురువులనే గులాబీ పార్టీ మట్టికరిపించింది
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



బీఆర్ఎస్‌ను 100 మీటర్ల లోపల బొంద పెడ్తామన్న సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్‌అయ్యారు. 'తెలంగాణ తెచ్చినందుకా.. తెలంగాణను అభివృద్ధి చేసినందుకా? లేక మిమ్మల్ని, మీ దొంగ హామీలను ప్రశ్నిస్తున్నందుకా? అంటూ నిలదీశారు. 100 మీటర్ల లోపల బీఆర్ఎస్‌ను బొంద పెట్టే సంగతి తర్వాత చూసుకుందాం కానీ, వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీల సంగతేందని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల సన్నాహక సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. రేవంత్ రెడ్డి లాంటి అహంకార నాయకులను టీఆర్ఎస్ పార్టీ తన ప్రస్థానంలో చాలామందిని చూసిందని వెల్లడించారు. మఖలో పుట్టి పుబ్బలో పోయే పార్టీ

..మిగతా 2 లో



## భవిష్యత్ అవసరాల ప్రకారం.. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ చేయాలి

- మంత్రులు భట్టి విక్కమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నంది అవార్డులపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఉండాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన 2024- 25 వార్షిక బడ్జెట్ సన్నాహక సమావేశంలో వివిధ రోడ్లు , భవనాలు , రైల్వే బ్రిడ్జిలు, సినిమా పరిశ్రమకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపుల ప్రతిపాదనలపై ఆ శాఖల ఉన్నతాధికారులతో చర్చించారు.

ఇష్టం వచ్చినట్టుగా కాకుండా క్రమ పద్ధతిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆమోదయోగ్యంగా ఉండే విధంగా అలైన్‌మెంట్ ఉండాలని సూచించారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రోడ్లు, భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. భూసేకరణకు బడ్జెట్ లో నిధులు కేటాయించాలని, నల్గొండ, హైదరాబాద్ లో కలెక్టరేట్ల నిర్మాణాలు చేపట్టడం, రాష్ట్రంలో ఆర్వోబీలు, ఆర్ యూబీలు, వీయూబీ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి రాష్ట్రం నుంచి ఇవ్వాల్సిన నిధులు కేటాయించాలని అధికారులకు ఆదేశించారు.

**నంది అవార్డులపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం..**

సినిమాటోగ్రఫీ అంశంపై జరిగిన చర్చలో సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం కేటాయించిన భూములను కాపాడాలని అధికారులను ఆదేశించారు. సామాజిక బాధ్యతలో భాగంగా డ్రగ్స్ వంటి మహమ్మారి వ్యసనాల వ్యతిరేక ప్రచారంలో సినిమా సెలబ్రిటీలు పాల్గొనే విధంగా ఒప్పించే ప్రయత్నం చేయాలని తెలిపారు. నంది అవార్డు లపై క్యాబినెట్ లో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సినిమా టికెట్ల కంటే థియేటర్‌లో అమ్మే చిరుతిళ్లకు వందరేట్లు వసూళ్లకు పాల్పడుతున్నారని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. చిత్రపురి కాలనీలో ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలున్నాయని వాటిపై తగిన సమయంలో నిర్ణయం తీసుకుందామని తెలిపారు.



## అఖిల్ పహిల్వాన్ కేసులో సంచలన నిజాలు

- మొబైల్ ఫోన్‌నిండా వారి నంబర్లే.. సెలబ్రిటీలవి కూడా..
- బుల్లితెరకు చెందిన సెలబ్రిటీలకు అమ్మాయిల సప్లై?

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** అబిడ్స్‌లో వెలుగు చూసిన సెక్స్ రాకెట్‌లో సంచలన విషయాలు బయపడుతున్నాయి. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన అఖిల్ పహిల్వాన్‌కు టాలీవుడ్‌తో పాటు బుల్లితెరకు చెందిన పలువురు సెలబ్రిటీలతో సన్నిహిత పరిచయాలు

..మిగతా 2 లో

## కొమురవెల్లిలో కొత్త రైల్వే స్టేషన్

- ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ ఆదేశాలు
- భక్తుల రద్దీతో సౌకర్యార్థం కీలక నిర్ణయం
- మల్లన్న భక్తులకు మోడీ కానుక.. కిషన్ రెడ్డి
- స్టేషన్ కోసం పలుమార్లు లేఖలు
- త్వరలోనే పనుల ప్రారంభం



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

కొమురవెల్లి మల్లన్న భక్తుల సుదీర్ఘ కోరిక త్వరలోనే నెరవేరబోతోంది. మనోహరాబాద్‌కొత్తపల్లి మధ్యలో కేంద్రప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న రైల్వే మార్గంలో ఉన్న కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దక్షిణ మధ్య రైల్వే నిర్ణయంతో కొమురవెల్లిలో రైలు హాల్టింగ్ కు మార్గం సుగమమైంది. కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ అవసరం, భక్తుల సౌకర్యం గురించి గతంలో తాను పలుమార్లు లేఖలు రాశానని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో గుర్తుచేశారు. దీని సాధ్యాసాధ్యాలపై చర్చించిన రైల్వేశాఖ.. కొమురవెల్లి మల్లన్న జాతర సందర్భంగా.. రైల్వే హాల్ట్ స్టేషన్ నిర్మాణానికి అంగీకారం తెలిపినట్లు ఆయన వెల్లడించారు. లక్డారం దుద్దెడ స్టేషన్ల మధ్యన కొమురవెల్లిలో కొత్త హాల్ట్ స్టేషన్ నిర్మాణానికి పచ్చ జెండా ఊపుతూ రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది. కాగా రైల్వే అధికారుల నిర్ణయంపై కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జాతర ప్రారంభానికి ముందుగా కొమురవెల్లి మల్లన్న భక్తులకు ప్రధాని మోడీ ప్రభుత్వం అందించిన కానుక.. ఈ రైల్వేస్టేషన్ అని కొనియాడారు. మల్లన్న భక్తులకు రైల్వే మార్గం త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని, రైల్వేస్టేషన్ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని కేంద్రమంత్రి తెలిపారు.

## తెలంగాణ పల్లెల్లో.. స్పెషల్ ఆఫీసర్ల పాలన!

- 10 రోజుల్లో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- గ్రామ పంచాయతీల ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే?
- లోకల్ బాడీస్‌లో ఖరారు కాని బీసీ రిజర్వేషన్లు
- ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఆఫీసర్ల పాలనలో హామీల అమలు ఎలా?
- చెక్ పవర్ ఎవరికి ఇస్తారనే అంశంపై గ్రామాల్లో చర్చ
- మే నెలలో ఎన్నికలుంటాయంటున్న విశ్లేషకులు




**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

పది రోజుల్లో తెలంగాణలో ప్రస్తుత సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుంది. మరి కొంత కాలం సర్పంచ్‌ల పదవీకాలాన్ని పొడిగిస్తారా? లేక ప్రత్యేక అధికారులను నియమిస్తారా? అన్న చర్చ మొదలైంది. అయితే రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలు ఇప్పట్లో లేకపోవచ్చు అనే వాదనలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. మరి వచ్చే నెల 1వ తేదీతో ఇప్పుడు ఉన్న సర్పంచ్‌ల పదవీకాలం ముగిస్తే.. గ్రామాల్లో పాలన ఎలా.? సర్పంచ్‌ల ప్లేస్‌లో ఎవరిని నియమిస్తారు. సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్‌ను ఎవరికి ఇస్తారు.? గ్రామాల్లో పాలనను ఎవరు కొనసాగిస్తారు..? ఇలా అనేక అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వం, పంచాయతీ రాజ్ ఆఫీసర్లపై ఉన్నది.

**ప్రజలు నిలదీస్తారని సర్పంచ్ ల భయం..**

అయితే ఇప్పటికిప్పుడు పంచాయతీ ఎన్నికలు నిర్వహణ కష్టం అని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు ఎన్నికల నిర్వహణకు కనీసం 3 నెలల సమయం

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం,
21.01.2024
హైదరాబాద్

# తెలంగాణ పల్లెల్లో.. స్పెషల్ ఆఫీసర్ల పాలన!

మొదటిపేజీ తరువాయి

కావాలి అంటున్నారు. కానీ అంత సమయం లేకపోవడంతో ఈ సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడిగిస్తారా? లేక ప్రత్యేక అధికారి పాలన పెడతారా? అనేది ప్రభుత్వం స్పష్టం చేయడం లేదు. ఇప్పటికే గత అసెంబ్లీ ఎలక్షన్ల ముందు నుంచి గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన 6 గ్యారంటీలు ఎలా.? అని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గ్రామసభలు పెడితే 6 గ్యారంటీలతో పాటు, ఇతర హామీలపై ప్రభుత్వాన్ని, అధికారులను ఎక్కడ నిలదీస్తారోననే భావనలో ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తోందని సర్పంచ్‌లు అంటున్నారు.

**చెక్‌పవర్‌ఎవరికో..**

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయితీ చెక్ పవర్ ఎవరికి ఇస్తారో అనేది ఇంకా స్పష్టం కావాల్సి ఉంది. అయితే ఎంపీడీవోతో పాటు గ్రామ కార్యదర్శికి ఇస్తారా..? లేక తహసీల్దార్, పంచాయతీ రాజ్ ఇంజినీర్లకు ప్రత్యేక బాధ్యతలు ఇస్తారా..? అదీకాక 4 గ్రామాలకు ఒక్క మండల స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించి వారికే చెక్ పవర్ ఇస్తారా.? అనే అంశం ఇంకా తేలాల్సి ఉంది. అయితే గతంలో 4,5 గ్రామాలకు ఒక్క మండల స్థాయి అధికారిని నియమించి గ్రామ కార్యదర్శికి చెక్ పవర్ ఇచ్చారు. ఈసారి కూడా గతం మాదిరిగానే చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**గెలవమనే భావనలో ప్రభుత్వం..**

కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్నా.. సమయానికి గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. ఈసారి కూడా అదే తరహా వ్యవహరిస్తోందని సర్పంచ్‌లు అంటున్నారు. అసలే గ్రామాల్లో రైతులకు రైతు బంధు అమలు చేయలేదు. ఎన్నికల్లో గెలవగానే 2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం ఇప్పటివరకు దానిపై సమీక్ష జరపలేదు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం కరెంట్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికలను నిర్వహిస్తే గెలువం అనే భావనలో కాంగ్రెస్ పార్టీ ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే ప్రత్యేక అధికారి పాలన తేవాలని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. గ్యారంటీల అమలు చేసి కొన్ని పథకాలు లబ్ధిదారులకు అందించాక గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోతే లాభం చేకూరుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది.

**మెజారిటీ సర్పంచ్‌లు బీఆర్‌ఎస్‌వారే..**

ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ సర్పంచ్‌లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. అంతేకాదు గ్రామాల్లో బీఆర్ఎస్‌కు బలమైన క్యాడర్ ఉంది. ఇలాంటి సమయంలో ఎన్నికలకు వెళ్తే బీఆర్ఎస్‌కు మేలు జరుగుతుందనే వాదన వినిపిస్తోంది. అందుకే ప్రత్యేక అధికారి పాలన పెట్టి గ్రామాల్లో కొంత వరకైనా హామీలు అమలు చేసి ఎన్నికల్లోకి వెళ్లాలని భావిస్తోందని సమాచారం. అందుకే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆచితూచి వ్యవహరిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

**ఖరారు కాని బీసీ రిజర్వేషన్లు..**

సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన ప్రకారం రాష్ట్ర బీసీ కమిషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రాజకీయ వెనుకబాటుతనాన్ని స్టడీ చేసి దానికి అనుగుణంగా రిజర్వేషన్లను ఖరారు చేయాలని స్పష్టం చేసింది. దీంతో గత ఎన్నికల్లో అమలైన రిజర్వేషన్ విధానానికి బదులుగా కొత్త లెక్కలు వేయాల్సి ఉన్నది. ఇప్పటివరకూ స్టేట్ బీసీ కమిషన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక వెళ్లకపోవడంతో బీసీ రిజర్వేషన్లపై స్పష్టత రాలేదు. ఆ నివేదిక అందిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడంపై నిర్ణయం తీసుకోనున్నది. రిజర్వేషన్ విషయంలో డీలిమిటేషన్ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. ఆ లెక్క తేలిన తర్వాత ప్రాసెస్ మొదలవుతుంది.

**లోక్‌సభ ఎన్నికలతో చిక్కులు..**

స్థానిక ఎన్నికల నిర్వహణకు లోక్‌సభ ఎన్నికలతో చిక్కులు వచ్చే అవకాశమున్నది. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ తదితర అధికారులు లోక్‌సభ ఎన్నికలకు రెడీ అవుతున్నారు. మార్చి నెలలోనే లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు వెలువడే అవకాశం ఉన్నందున ఆ పనుల్లో బిజీ కానున్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అప్పటివరకూ జరపడానికి ఆచరణాత్మక ఇబ్బందులు తలెత్తనున్నాయి. షెడ్యూలు ప్రకారం జూన్‌లో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరగనున్నందున అవి కూడా నెల రోజులు ఆలస్యమయ్యే చాన్స్ ఉన్నది.

# అఖిల్ పహిల్వాన్ కేసులో సంచలన నిజాలు

మొదటిపేజీ తరువాయి

ఉన్నట్టుగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో అఖిల్‌పహిల్వాన్ టాలీవుడ్, బుల్లితెరకు చెందిన వారికి కూడా యువతులను సరఫరా చేస్తున్నట్టుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పోలీసులతో మాట్లాడగా ఈ కోణంలో కూడా దర్యాప్తు జరుపుతామని చెప్పడం గమనార్హం.

రాంనగర్ ప్రాంతానికి చెందిన అఖిల్‌పహిల్వాన్ తన స్నేహితుడైన రఘుపతితో కలిసి కొంతకాలంగా హైదరాబాద్‌లో సెక్స్‌రాకెట్ నడుపుతున్నాడు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన నిరుపేద కుటుంబాల్లోని యువతులను ఆన్‌లైన్ ద్వారా సంప్రదించి హైదరాబాద్ వచ్చి తాము చెప్పినట్టుగా చేస్తే రోజుకు 15 నుంచి 25వేల రూపాయలు సంపాదించుకోవచ్చని ఉచ్చులోకి లాగేవాడు. బస, ఇతరత్రా ఏర్పాట్లు తానే చేస్తానని చెప్పేవాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల కింద పశ్చిమ బెంగాల్‌నుంచి పదహారు మంది యువతులు హైదరాబాద్ వచ్చారు.వీరందరినీ అఖిల్‌పహిల్వాన్ అబిడ్స్‌లోని ఫార్చ్యూన్ లాడ్జీలో బస చేయించాడు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే లాడ్జీలో 25 గదులు ఉండగా 16 గదులను అఖిల్‌పహిల్వాన్ బుక్ చేయటం. ఎలాంటి ఆధార పత్రాలు లేకుండానే యువతులకు బస కల్పించటం. ఇలా లాడ్జీలో దిగిన యువతుల వద్దకు అఖిల్‌పహిల్వాన్ అతని సహచరుడు రఘుపతి కస్టమర్లను పంపిస్తూ వ్యభిచారం జరిపిస్తున్నారు. ఈ మేరకు పక్కాగా సమాచారం అందడంతో లాడ్జిపై దాడి జరిపిన పోలీసులు 16మంది యువతులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఓ యువతి ముంబాయి నుంచి ఇక్కడికి వచ్చింది. దర్యాప్తులో వీళ్లు వెల్లడించిన వివరాల నేపథ్యంలో పోలీసులు ఈ రాకెట్ నడుపుతున్న అఖిల్‌పహిల్వాన్, రఘుపతిలను అరెస్టు చేశారు. దాంతోపాటు కస్టమర్లయిన అభిషేక్‌భాటి, కేశవ్ వ్యాస్, అబ్దుల్‌ఖలీద్, సంతోష్‌లను కూడా అరెస్టు చేశారు. అదుపులోకి తీసుకున్న యువతులను రిహాబిలేషన్ సెంటర్‌కు తరలించారు. నిందితుల నుంచి 22 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు.

**సెలబ్రెటీల నెంబర్లు..**

అఖిల్‌పహిల్వాన్ నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లోని వివరాలను విశ్లేషించగా టాలీవుడ్, బుల్లితెరకు చెందిన పలువురు నటీనటుల నెంబర్లు ఉన్నట్టుగా నిర్ధారణ అయ్యింది. దాంతోపాటు పశ్చిమ బెంగాల్‌కు చెందిన పలువురు యువతుల ఫోన్ నెంబర్లు కూడా ఉన్నట్టు తేలింది. ఈ నేపథ్యంలో అఖిల్‌పహిల్వాన్ టాలీవుడ్, బుల్లితెరకు చెందిన నటులకు కూడా యువతులను సప్లై చేసినట్టుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌నర్సింహ్మా రాజుతో మాట్లాడగా ఇప్పటివరకు జరిపిన దర్యాప్తులో అఖిల్ పహిల్వాన్ టాలీవుడ్, బుల్లితెర నటులకు అమ్మాయిలను సప్లై చేసినట్టుగా ఎలాంటి వివరాలు వెల్లడి కాలేదన్నారు. అయితే, అతని సెల్‌ఫోన్లో పలువురు సెలబ్రెటీల నెంబర్లు ఉన్నట్టుగా చెప్పారు. ఈ నేపథ్యంలో వెలుగు చూసిన సెక్స్‌రాకెట్‌తో ఎవరైనా నటులకు సంబంధాలు ఉన్నాయా?, అఖిల్‌పహిల్వాన్ ద్వారా ఎవరైనా నటులు యువతులను పిలిపించుకున్నారా? అన్న కోణాల్లో విచారణ చేస్తున్నట్టు తెలిపారు.

# కరెంటు బిల్లులు కట్టొద్దు

మొదటిపేజీ తరువాయి

అని మీలాంటోళ్లు చాలామంది నీలిగిన్రు. అయినా రెండున్నర దశాబ్దాల పాటు నిలబడి, నీలాంటి వాళ్లను మట్టికరిపించిందన్నారు. 'పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీజేపీలు కలిసిపోతాయి. రేవంత్.. కాంగ్రెస్ పార్టీలో ఏక్ నాథ్ షిండేగా మారుతాడు. రేవంత్ రక్తం అంత బీజేపీదే. ఇక్కడ చోటా మోదీగా రేవంత్ రెడ్డి మారిండు. గతంలో అదానీ గురించి అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఈరోజు అదానీ కోసం వెంటపడుతున్నాడు. స్విట్జర్లాండ్‌లో రేవంత్ రెడ్డి అదానీతో అలైబలై చేసుకున్నాడు. అదానీరేవంత్ రెడ్డి ఒప్పందాల అసలు లొగుట్టు బయటపెట్టాలి. రాహుల్ గాంధీ ఏమో అదానీ గురించి వ్యతిరేకంగా మాట్లాడితే.. ఈ రోజు రేవంత్ రెడ్డి అదానీ కోసం అర్రులు చేస్తున్నాడు. డబుల్ ఇంజన్ అంటే అదానీ, ప్రధాని అని వ్యాఖ్యానించిన రేవంత్.. ఇప్పుడు ట్రిపుల్ ఇంజన్‌గా మారిండు. ఈ జనవరి నెల కరెంటు బిల్లులు ప్రజలు ఎవరూ కట్టవద్దు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉచిత విద్యుత్ పథకం గృహజ్యోతి హామీని నెరవేర్చే దాకా బిల్లులు కట్టొద్దు. స్వయంగా ముఖ్యమంత్రి.. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పినట్లుగానే ఉచిత విద్యుత్ కోసం డిమాండ్ చేయాలి. కరెంటు బిల్లులు అడిగితే అధికారులకు ముఖ్యమంత్రి మాటలను చూపించాలి. హైదరాబాద్ నగరంలో ఉన్న ప్రతి ఒక్క మీటర్‌కి గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ అందించాలి. గృహ జ్యోతి కార్యక్రమాన్ని వెంటనే అమలు చేయాలి.. ఇందులో కిరాయి ఇండ్లలో ఉండే వాళ్లకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలి. మహాలక్ష్మి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్క మహిళకు రూ.2500 వెంటనే ఇవ్వాలి. ఇచ్చిన హామీలను తప్పించుకోవడానికి కాంగ్రెస్ చూస్తే వదిలి పెట్టే పరిస్థితి లేదు. బీజేపీతో బీఆర్ఎస్‌కు ఏరోజు పొత్తు లేదు.. భవిష్యత్తులోనూ ఉండదు. కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి సికింద్రాబాద్‌కు గత ఐదేండ్లలో ఏం చేసిండో చెప్పాలి. కేసీఆర్ ప్రపంచంలోనే అతిపెద్ది లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కడితే, కిషన్ రెడ్డి సీతాఫల్ మండి రైల్వే స్టేషన్‌లో లిఫ్టులను జాతికి అకింతం చేశారు. ఇదే అయన చేసిన అతిపెద్ద పని. బీఆర్ఎస్ కేసీఆర్ ఆధ్వర్యంలో 36 ఫ్లైఓర్లు కడితే.. ఉప్పల్, అంబర్‌పేట ఫ్లైఓవర్లు సంవత్సరాలైనా కట్టలేక చేతులెత్తేశారు. రాష్ట్రంలో బీజేపీని అడ్డుకున్నది ముమ్మాటికి బీఆర్ఎస్ పార్టీనే. బీఆర్ఎస్ వల్లే బీజేపీ సీనియర్ నాయకులు హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో పోటీకి వెనుకంజ వేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కేవలం ఒక స్పీడ్ బ్రేకర్ మాత్రమే అని గుర్తుంచుకోవాలి. ఓడినా గెలిచినా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజాపక్షమే. కేవలం 50 రోజుల కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల నుంచి మొదలుకొని అనేకమంది ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. రైతన్నలకు రైతుబంధు అందడం లేదు. మహిళలకు వాగ్దానం చేసిన రూ.2500 రావడం లేదు. వివిధ డిక్లరేషన్ల పేరుతో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కాంగ్రెస్ పార్టీ అమలు చేసేదాకా వెంటాడుతాం' అని కేటీఆర్ అన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్సే

- బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే పోటీ
- 2014లో కరీంనగర్‌లో బీఆర్ఎస్‌దే గెలుపు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం లేదు
- ప్రతిపక్ష పాత్రను సమర్ధవంతంగా పోషిస్తాం
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్

విశాలభారతి,హైదరాబాద్:




పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ధీమాను వ్యక్తం చేశారు. శనివారం క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉంటుందని పేర్కొన్నారు. 2014లోనూ నరేంద్ర మోదీ ప్రభంజనంలోనూ కరీంనగర్ లో బీఆర్ఎస్ గెలిచిందని అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ మూడవ స్థానానికే పరిమితమైందని ఆరోపించారు. కాంగ్రెస్ సొంతంగా ఇక్కడ గెలిచింది లేదని, ఎమ్మెస్సార్ కూడా బీఆర్ఎస్ సపోర్ట్‌తోనే గెలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం తమకు లేదు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా తీర్పును శిరసావహిస్తామని, ప్రజా తీర్పును గౌరవిస్తామని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి పోరాడుతామని, అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్రను సమర్ధవంతంగా పోషిస్తామని తెలిపారు.

బీఆర్ఎస్‌ను ఎవరూ చీల్చలేరని స్పష్టం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో అత్యధిక కార్పొరేటర్లు బీఆర్ఎస్ సభ్యులే ఉన్నారని,ఇక్కడ అవిశ్వాసం ఉండబోదని అన్నారు. 45 రోజుల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి నిలిచిపోయిందని ఆరోపించారు. కరీంనగర్ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల విషయంలో రాజకీయాలు అవసరం లేదని తెలిపారు. ' అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠాపనను రాజకీయ కోణంలో చూడం. రాముడు అందరివాడు. దైవ కార్యక్రమం ఎవరు చేసినా సంతోషిస్తాం. స్వాగతిస్తామని' గంగుల కమలాకర్ అన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

- ప్రమాద భీమా పెంపు
- రూ. 40 లక్షల నుంచి రూ. 1కోటి వరకు
- యూబీఐతో టీఎస్ఆర్టీసీ ఒప్పందం
- ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి
- టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ప్రకటన

విశాలభారతి,హైదరాబాద్:



తమ ఉద్యోగులకు ప్రమాద బీమా పెంపుపై యూబీఐతో టీఎస్ఆర్టీసీ ఒక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం.. రూ.40 లక్షల నుంచి రూ. ఒక కోటికి ప్రమాద బీమా పెరిగింది. హైదరాబాద్ లోని బస్ భవన్ లో శనివారం ప్రమాద బీమా పెంపుపై టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్, యూబీఐ సీజీఎం అండ్ జోనల్ హెడ్ భాస్కర్ రావులు ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు. రోడ్డు ప్రమాదాల్లో అకాల మరణం చెందిన, శాశ్వతంగా దివ్యాంగులైన సిబ్బందికి ఈ ప్రమాద బీమా వర్తించనుంది. యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ (యూఎస్ఎస్ఏ) కింద రూ.కోటి ప్రమాద బీమాను అందించనున్నారు. రూపే కార్డు ద్వారా మరో రూ.12 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. ఎలాంటి ప్రీమియం చెల్లించకుండానే మొత్తంగా రూ.1.12 కోట్ల వరకు ప్రమాద బీమాను యూబీఐ సహకారంతో బాధిత కుటుంబాలకు సంస్థ అందించనుంది. ఫిబ్రవరి 1 వ తేది నుంచి ఈ ప్రమాద బీమా అమల్లోకి వస్తుంది.

ఈ సందర్భంగా సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ గారు మాట్లాడుతూ.. ఎలాంటి ప్రీమియం చెల్లింపు లేకుండా రూ.1.12 కోట్ల వరకు ప్రమాద బీమాను పెంచడం శుభపరిణామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో అకాల మరణం చెందిన, శాశ్వతంగా దివ్యాంగులైన సిబ్బంది కుటుంబాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రమాద బీమాను పెంచాలని కోరగానే అంగీకరించిన యూబీఐ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రమాద బీమా పెంపు అంశాన్ని రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు స్వాగతించారని, ఇది సిబ్బందికి ఎంతో మేలు చేకూరుస్తుందని అభిప్రాయపడ్డారని చెప్పారు.

యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ కింద రోడ్డు ప్రమాదాల్లో మరణించిన 12 మంది సిబ్బంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.40 లక్షల చొప్పున అందజేశామని తెలిపారు. గతంలో శాలరీ శ్లాబులతో ప్రమాద బీమా ఇచ్చేవారని, ఈ కొత్త ఒప్పందంలో శాలరీ శ్లాబులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క సిబ్బందికి రూ.ఒక కోటి ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. రూపే కార్డు ఉంటే మరో రూ.12 లక్షల బీమా అందుతుందని వివరించారు. సిబ్బంది, ఉద్యోగుల శాలరీ అకౌంట్స్‌ను రెండేళ్ల క్రితం యూబీఐకి టీఎస్ఆర్టీసీ యాజమాన్యం మార్చిందని, ఈ ఖాతా ద్వారా ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఉందని చెప్పారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయే కుటుంబ సభ్యులకు సంస్థ అండగా నిలుస్తోందని, వారు ఆత్మ స్థైర్యం, ధైర్యం కోల్పోకుండా ఉండేందుకు బాధిత కుటుంబానికి ఈ ఉచిత ప్రమాద బీమా ఆసరాగా నిలుస్తుందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు గుర్తు చేశారు. యూబీఐ ఉచిత ప్రమాద బీమాపై సిబ్బందికి అవగాహన కల్పించాలని, యూఎస్ఎస్ఏ ఖాతాలో ఉందో.. లేదో చెక్ చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రూపే సెలక్ట్ కార్డును తీసుకుని, దానితో లావాదేవీలు చేసుకోవాలని, అప్పుడే రూ.12 లక్షల ప్రమాద బీమాను పొందగలుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ వి.రవిందర్, ఈడీలు ఎస్.కృష్ణకాంత్, పీవీ మునిశేఖర్, వినోద్ కుమార్, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ అడ్వైజర్ విజయ పుష్ప, సీపీఎం ఉషాదేవి, యూబీఐ జనరల్ మేనేజర్ కృష్ణన్, డిప్యూటీ జోనల్ హెడ్ లు రవి కుమార్, అర్వింద్ కుమార్, సికింద్రాబాద్ రీజినల్ హెడ్ అరుణ్ కుమార్ తో పాటు టీఎస్ఆర్టీసీ హెచ్ వోడీలు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ అధికారం

- రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా రేవంత్ మాటలు
- లోక్‌సభలో అదానీపై రాహుల్ గాంధీ విమర్శలు
- అదే అదానీతో రేవంత్ ఎంవోయూలు
- సీఎంపై బీఆర్ఎస్ నేత శ్రవణ్ విమర్శలు

విశాలభారతి,హైదరాబాద్:



అబద్ధాల పునాదులపై సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. దావోస్‌లో ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖడిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా రేవంత్ మాట్లాడారని విమర్శించారు. కేటీఆర్‌పై రేవంత్ రెడ్డి దుర్మార్గమైన మాటలు మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ నేత మన్నె క్రిశాంక్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఐటీ ఎగుమతులను రూ.57 వేల కోట్ల నుంచి రూ.2 లక్షల కోట్లకు తీసుకెళ్లామన్నారు. ఐటీ రంగంలో 10 లక్షల ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. లోక్‌సభలో అదానీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. అదే అదానీతో రేవంత్ ఎంవోయూలు కుదుర్చుకున్నారని విమర్శించారు. అదానీతో ఢిల్లీలో కాంగ్రెస్ కుస్తీ.. తెలంగాణలో దోస్తీ అన్నట్లు ప్రస్తుం పరిస్థి ఉందని చెప్పారు. రేవంత్ తెలంగాణను అదానీకి తాకట్టు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ప్రధాని మోదీని కలిసిన తర్వాతే అదానీతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోదీ తొత్తుగా పనిచేస్తున్న అదానీతో రేవంత్ దోస్తీ ఏందని ప్రశ్నించారు. రక్షణ రంగంలో అదానీకి అనుభవం లేదని రాహుల్ గాంధీ అన్నారని, తెలంగాణలో ఆయన డిఫెన్స్ పరిశ్రమలకు రేవంత్ అనుమతులు ఇస్తున్నారని చెప్పారు. దొంగలు దొంగలు దేశాలు పంచుకున్నట్లుగా అదానీ, రేవంత్ దోస్తీ ఉందని విమర్శించారు.

# రాష్ట్ర విషయంలో ఎప్పుడూ రాజీపడం

- నీళ్ల విషయంలో శాశ్వత ప్రయోజనాలు కలగాలి
- కేఆర్ఎంబీ నిర్వహిస్తే తెలంగాణకు తీవ్ర అన్యాయం
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

విశాలభారతి,హైదరాబాద్:



తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఏర్పడిందే నీళ్ల కోసమని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తామెప్పుడూ రాజీ పడలేదని తెలిపారు. నీళ్ల విషయంలో తెలంగాణకు శాశ్వత ప్రయోజనాలు కలగాలని వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, పార్టీ నాయకుడు గెల్లు శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాల కోసం కేసీఆర్ ఎప్పుడూ పోరాడలేదనేది అవాస్తవమన్నారు. కేంద్ర షరతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఒప్పుకున్నదని ప్రశ్నించారు. కేఆర్ఎంబీ పరిధిలోకి వచ్చేందుకు తెలుగు రాష్ట్రాలు ఒప్పుకున్నాయని కేంద్రం చెబుతున్నదని తెలిపారు.

ఉమ్మడి ప్రాజెక్టులను కేఆర్ఎంబీ నిర్వహిస్తే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ తెచ్చుకున్న లక్ష్యాలు నెరవేరకపోగా నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కేఆర్ఎంబీ పరిధిలోకి శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులను తీసుకెళ్లడం సరికాదని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రాజెక్టుల విషయంలో మంత్రుల ప్రకటన ఆశ్చర్యం కలిగిస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను ప్రభుత్వం కేంద్రానికి తాకట్టు పెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. శ్రీశైలం, సాగర్‌లను కేఆర్ఎంబీకి అప్పగిస్తే నిర్మాణం కావలసిన ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు. జల విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర ఇబ్బందులు తప్పవని, ప్రతి విషయంలో కేంద్రంపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. అందువల్ల రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందని వెల్లడించారు. ఆంధ్ర ప్రయోజనాలను నెరవేర్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయలేక తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ప్రాజెక్టుల్లో సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని, యాసంగికి నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పచ్చని పంటలతో రాష్ట్రం పచ్చబడుతున్నదని, యాసంగి సాగుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డివి అసంబద్ధ వ్యాఖ్యలని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరుకు జాతీయ హోదాపై ఎందుకు నోరుమెదపడం లేదని నిలదీశారు.

# ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపుల కేసులో పురోగతి..

మొదటిపేజీ తరువాయి

ఫిర్యాదు చేయగా, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. వీఐపీ నంబర్‌లను ఉపయోగించి కాల్ లోకేషన్స్ అధారంగా దర్యాప్తు చేపట్టారు తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు. దీంతో కువైట్ నుంచి కాల్స్ చేసినట్లు గుర్తించారు. 14 ఏండ్లుగా కువైట్ లో ఉంటున్న మహమ్మద్ ఖాసీమ్.. ఇంటర్నెట్ ప్రోటోకాల్ ద్వారా రాజాసింగ్‌ను బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బెదిరిస్తున్న వ్యక్తి ప్రస్తుతం కువైట్ లో ఉంటున్నట్లు తేలింది. హైదరాబాద్ పాత బస్తీలోని చాంద్రాయణగుట్టకు చెందిన ఖాసీమ్‌గా గుర్తించారు. అంతకు ముందు అతను సౌదీ అరేబియాలో ఉన్నట్లు వివరాలు కనుగొన్నారు. న




భువన తేజ ఇన్ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ చెక్కా వెంకటసుబ్రహ్మణ్యం గారికి విశాల భారతి నూతన సంవత్సర క్యాలెండర్ ను అందజేసిన కీర్తి మీడియా డైరెక్టర్ మాదారపు అశోక్, ఎడిటర్ గడ్డం శ్యామ్.

# వేయి పశువులను తిన్న రాబంధు.. నీతి కథలు చెప్పినట్లుంది

- బిల్లులు రాక సర్పంచుల సూసైడ్ చేసుకుంది మరిచిన్రా?
- ఎమ్మెల్యే కేటీఆర్‌కు మంత్రి సీతక్క స్ట్రాంగ్ కౌంటర్

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:



ప్రభుత్వం సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని.. లేదంటే వారి తరుపున గొంతు విప్పుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి సీతక్క స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సర్పంచ్‌లకు నిధులు ఇవ్వకుండా బాధపెట్టింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. ఇప్పుడు ఇదే బీఆర్ఎస్ పార్టీ నేతలు, మాజీ మంత్రి కేటీఆర్ సర్పంచ్‌ల కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందని సీతక్క ఎద్దేవా చేశారు. సర్పంచుల కోసం పోరాడుతామని కేటీఆర్ అనడం.. వేయి పశువులను తిన్న రాబంధు నీతి కథలు చెప్పినట్లు ఉందని సీతక్క దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే పెండింగ్ బిల్లులు రాక ఎంతో మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఫైర్ అయ్యారు. ఇంట్లో ఆడవాళ్ల పుస్తెల తాళ్లు అమ్మి మరీ అభివృద్ధి పనులు చేస్తే.. అప్పటి బీఆర్ఎస్ సర్కార్ ఫండ్స్ రిలీజ్ చేయకపోవడంతో చేసేదేమి లేక ఎంతో మంది సర్పంచులు సూసైడ్ చేసుకున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని సర్పంచుల ఆత్మహత్యలకు బీఆర్ఎస్ పార్టీనే కారణమన్నారు.



# సిటీ కేంద్రంగా 'హై'రైజ్

## శరవేగంతో విస్తరిస్తున్న ఆకాశహర్మ్యాలు

## విదేశీ తరహాలో హైరైజ్ కల్చర్‌కు సిటీ జనాలు అట్రాక్ట్

## వచ్చే ఐదేళ్లలో భారీగా ఆకాశన్నంటే భవనాలు

**రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ నగరం దూసుకుపోతున్నది. దేశంలోని అన్ని మెట్రో నగరాల కంటే వేగంగా రూపాంతరం చెందుతున్నది. ఇప్పటికే మోస్ట్ వాల్యూబుల్ రియల్ ఎస్టేట్ మార్కెట్ కలిగిన ప్రాంతాల్లో ఒకటిగా ఉండగా... ఆ స్థాయికి తగినట్లుగా ఆధునిక జీవనశైలిని ప్రతిబింబించేలా నిర్మాణ రంగంలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో నగరంలో గడిచిన కొంత కాలంలో హైరైజ్ కల్చర్ జెట్ స్పీడ్ వేగంతో పెరుగుతున్నది. వచ్చే ఐదేళ్లలో హైరైజ్ ప్రాజెక్టుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అధికారులు చెబుతుంటే దీనికి ఇప్పటివరకు నిర్మాణ అనుమతులు పొందిన హైరైజ్ ప్రాజెక్టులు 1200 పైనే ఉంటాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రియల్ ఎస్టేట్‌లోనూ శరవేగంగా విస్తరిస్తున్న హైరైజ్ కల్చర్ సిటీలోని ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ వంటి ప్రాంతాలతోపాటు నలువైపులా కొలువుదీరనున్నాయి. సకల సదుపాయాలను కలిగి విలాసవంతమైన జీవనవిధానాన్ని అందించేందుకు నగరవాసుల ముందుకు రానుండగా, ఆకాశమే హద్దుగా సాగుతున్న హైరైజ్ కల్చర్‌పై ఈ వారం విశాలభారతి రియల్ టాక్.**



కరోనా కంటే ముందు వేళ్ల మీద లెక్కపెట్టేంతగా మాత్రమే ఉండే హైరైజ్ ప్రాజెక్టులు గడిచినా మూడేళ్లలో వందల సంఖ్యకు చేరుకున్నాయి. హైరైజ్ ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియను మరింత వేగవంతంగా మంజూరు చేయడంతో.. 2023 నాటికి నగరంలో ఎత్తైన భవనాల సంఖ్యను రెట్టింపైంది. 30 నుంచి 40 అంతస్తుల కంటే ఎక్కువ ఎత్తులో ఉండే ప్రాజెక్టులకు వెస్ట్ సిటీలోని ప్రధాన ప్రాంతాలన్నీ హాట్ స్పాట్‌గా నిలువగా, మరిన్ని ప్రాజెక్టులకు అనుమతులు రానున్నాయని తెలిసింది. 2023లో అధికారులు కనీసం అర డజను ప్రాజెక్టులకు ఆమోదించగా, ఈ వర్టికల్ హోమ్‌లన్నీ కూడా 202728 నాటికి నిర్మాణం పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### 2021లోనే పెరిగిన భవనాలు..

గడిచిన 17 ఏళ్ల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో 1248 హైరైజ్ ప్రాజెక్టులకు అనుమతులిచ్చారు. ఇందులో 202123 నాటికి 634 ప్రాజెక్టులకు అనుమతించారు. నగరం యొక్క ఎత్తైన ఆకాశహర్మ్యం గచ్చిబౌలిలో అపర్ణా ఇన్‌ఫ్రా నిర్మిస్తున్న 50 అంతస్తుల భవనం పేరిట ఉండగా, పశ్చిమ కారిడార్‌లో ఉండగా, రాయదుర్గం, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, గోపన్‌పల్లి, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లోనే హైరైజ్ ప్రాజెక్టులు అత్యధికంగా ఉన్నాయి. ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ)పై పరిమితి లేనందున, చాలా మంది డెవలపర్‌లు హైరైజ్‌లకు అనుమతులు పొందడానికి ముందుకు వస్తున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. 2010వరకు నగరంలో హైరైజ్ భవనాలంటే వింతైన కట్టడమే. కానీ ఢిల్లీ, ముంబై, బెంగుళూరు వంటి కాస్మోపాలిటన్ సిటీలకు పోటీగా అభివృద్ధి చెందిన హైదరాబాద్‌లో గడిచిన ఐదేళ్లలో పదుల సంఖ్యలో స్కై స్క్రాపర్లు అందుబాటులోకి వచ్చాయి. ఒకేచోట 1500 మంది కుటుంబాలు నివాసం ఉండే ఈ కాంప్లెక్సులు మినీ నగరాలను తలపిస్తున్నాయి. దశాబ్ధ కాలంగా హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ ప్రాంతంలోనే కొలువుదీరిన హైరైజ్ భవనాలు క్రమంగా నగరంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా వెస్ట్ సిటీలో తరహాలో రవాణా సదుపాయాలు, ఓఆర్ఆర్‌కు సమీపంలో ఉండే ప్రాంతాలు, ఐటీ, ఐటీ అనుబంధ రంగాల విస్తరణకు అవకాశం ఉన్న ఈస్ట్ సిటీ వీటిని ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. అలా ఏడాది కాలంగా ఐదారు ప్రాజెక్టులు ఉప్పల్, ఎల్బీనగర్ కేంద్రంగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు బిల్డర్లు ముందుకు వచ్చారు.

### హైరైజ్ ప్రాజెక్టులకు పెరిగిన డిమాండ్

విజయవాడ హైవేకు సమీపంలో ఉండే దిల్ సుఖ్ నగర్, ఎల్బీ నగర్, హయత్ నగర్‌తోపాటు వరంగల్ హైవే వెంబడి ఉన్న ఉప్పల్, నాగోల్ వంటి ప్రాంతాలు హైరైజ్ ప్రాజెక్టుకు అనుకూలంగా ఉన్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో రెసిడెన్షియల్ ప్రాజెక్టులన్నీ కూడా స్టాండ్ ఏలోన్, ఇండిపెండెంట్ మాత్రమే ఎక్కువగా ఉన్నాయి. కానీ సకల సదుపాయాలతో లగ్జరీ అనుభూతినిచ్చే హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులు చాలా అరుదు. ఒకప్పుడు వెస్ట్ సిటీలో మాత్రమే కనిపించే ఈ తరహా ప్రాజెక్టులు సిటీ నలువైపులా విస్తరించడానికి ప్రధాన కారణాల్లో కస్టమర్ల అభిరుచియే ప్రధానంగా చెబుతున్నారు. ప్రస్తుతం సిటీలో విజయవాడ హైవే వెంబడి స్థిరపడిన వారు ఎక్కువగా టైర్2 నగరాలకు చెందినవారే ఉండగా, వీరంతా దిల్‌సుఖ్ నగర్, ఎల్బీ నగర్, ఉప్పల్ సమీప ప్రాంతాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. వీరిని దృష్టిలో పెట్టుకుని వాసవి గ్రూప్ ఒకేసారి మూడు ప్రాజెక్టులను మార్కెట్‌లోకి తీసుకువస్తోంది. అందులో ఎల్బీనగర్ సరూర్ నగర్ స్టేడియాన్ని ఆనుకుని నిర్మిస్తున్న ఆనంద నిలయం, ఉప్పల్ భగాయత్‌లో మరో రెండు హైరైజ్ కాన్సెప్ట్‌తో ప్రాజెక్టులను నిర్మిస్తోంది. ఎల్బీనగర్ కేంద్రంగా హైదరాబాద్ ఈస్ట్ సిటీలో 33 అంతస్తుల్లో 11 హైరైజ్ భవనాలతో చేపట్టిన వాసవి ఆనంద నిలయం ప్రాజెక్టు ఈస్ట్ సిటీకి తలమానికంగా మారనుంది. ఈ ప్రాంతంలో తొలి హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టుగా 3500 వేల ఫ్లాట్లతోపాటు స్కై విల్లాను ఆ గ్రూప్ నిర్మిస్తోంది. అదే తరహాలో ఈస్ట్ సిటీలో హైరైజ్ ప్రాజెక్టులకు పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా వెస్ట్ సిటీ తరహాలో ఈస్ట్ సిటీ కేంద్రంగా 40 ఫ్లోర్ల తొలి స్కై స్క్రాపర్ ప్రాజెక్టును ఎల్బీ నగర్ కేంద్రంగా టీఎన్ఆర్ గ్రూప్ నిర్మిస్తున్నది.

### సిటీ నలువైపులా...

**గతంలో కోర్ సిటీ నుంచి వెస్ట్ జోన్ పరిధిలోని హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, నానక్ రాంగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, రాయదుర్గం, కోకాపేట్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మెరుగైన రవాణా సదుపాయాలు ఉండేవి కావు. కానీ అందుబాటులోకి వచ్చిన ఆధునిక రవాణా సదుపాయాలు సుదూరాలను కూడా దగ్గర చేర్చాయి. అలా నగరం నలువైపులా వెళ్లేందుకు ఆయా ప్రాంతాలకు చేరుకునేలా మెట్రో వంటి రవాణా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఇంటర్నేషనల్ స్కూళ్లు, మెరుగైన వైద్య సదుపాయాలతోపాటు, రిక్రియేషనల్ జోన్లు అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు కావడంతో... గడిచిన కొంత కాలంగా సిటీ వ్యాప్తంగా హైరైజ్ కల్చర్ విస్తరించింది. వెస్ట్ సిటీ తరహాలో నగరం నలుమూలాల మౌలిక వసతులు అభివృద్ధి చెందడంతో ఈ తరహా ప్రాజెక్టులు విస్తరించింది. హైరైజ్ భవనాలు మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలకు అనుకూలంగా బిల్డర్లు నిర్మించడంతో సామాన్యులు కూడా కొనుగోళ్లకు ముందుకు వస్తున్నారు. వెస్ట్ సిటీతో పోల్చితే ఈస్ట్ సిటీ పుష్కళమైన ల్యాండ్ బ్యాంక్, ధరల్లో భారీ వ్యత్యాసం ఉండటంతో... అక్కడి కంటే తక్కువలోనే హైరైజ్ ఫ్లాట్లను కొనుగోలు చేయడానికి వీలు ఉంటుంది. ఇవే అంశాలు అటు డెవలపర్లను, ఇటు కస్టమర్లను హైరైజ్ నిర్మాణాల వైపు మొగ్గు చూపేలా చేస్తున్నాయి. ఉప్పల్ నుంచి ఎల్బీనగర్ వరకు సుమారు ఆరున్నర కిలోమీటర్ల వ్యవధిలో దాదాపు 7 ప్రాజెక్టులు రానుండటం నిర్మాణానికి ముందే చర్చనీయాంశంగా మారింది.**







# హనుమాన్ ఆలయం చేసిన శుభ్రం గవర్నర్

- గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్
- ప్రధాని పిలుపు మేరకు పాటించానని వెల్లడి

**విశాలభారతి,హైదరాబాద్:**

గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఖైరతాబాద్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అనంతరం లక్ష్మణ సమేత సీతారాములను దర్శించుకున్నారు. నవగ్రహ ప్రదక్షిణ చేశారు. ఈ నెల 22న అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం నేపథ్యంలో దేశంలో ఉన్న అన్ని ఆలయాను శుభ్రం చేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ అభియాన్ చేపట్టారు. అయోధ్యలో శ్రీరామమందిరం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలను శుభ్రం చేయాలని దేశ ప్రజలను ప్రధాని మోదీ అభ్యర్థించారు. జనవరి 22 నాటికి దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలు, దేవాలయాలను శుభ్రం చేయాలని, స్వచ్ఛతా ప్రచారాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈ నెల 12న మహారాష్ట్రలోని నాసిక్‌లో పర్యటించిన ప్రధాని.. శ్రీ కాలారామ్ ఆలయాన్ని శుభ్రం చేసిన విషయం తెలిసిందే.






# టీఎస్ఆర్టీసీలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

- విడుదల చేసిన ఎండీ సజ్జనర్
- బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ విద్యార్థులు అర్హులు
- ఫిబ్రవరి 16వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం

**విశాలభారతి,హైదరాబాద్:**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిపోల్లో అప్రెంటిస్ పోస్టుల భర్తీకి టీఎస్ఆర్టీసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అప్రెంటిస్ ట్రైనీ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ వంటి ఆనన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన గ్రాడ్యుయేట్లు ఈ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా నాన్ ఇంజనీరింగ్ అప్రెంటిస్ పోస్టుల్లో 150 ఖాళీగా ఉన్నాయని టీఎస్ఆర్టీసీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2130 ఏండ్ల మధ్య వయసు ఉండాలి. ట్రైనింగ్ పీరియడ్ మూడేండ్లు ఉంటుంది. మొదటి సంవత్సరం నెలకు రూ.15వేలు, రెండో సంవత్సరంలో నెలకు రూ.16వేలు, మూడో సంవత్సరంలో నెలకు 17వేలు స్టైఫండ్ అందించనున్నారు. అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు http://tsrtc.telangana.gov.in సంప్రదించవచ్చు.

**రీజియన్ల వారీగా ఖాళీల వివరాలు..**

హైదరాబాద్ రీజియన్ - 26
సికింద్రాబాద్ రీజియన్ - 18
మహబూబ్‌నగర్ - 14
మెదక్ - 12
నల్గొండ 12
రంగారెడ్డి 12
ఆదిలాబాద్ - 09
కరీంనగర్ 15
ఖమ్మం - 09
నిజామాబాద్ 09
వరంగల్ 14



శాంత శ్రీరామ్ కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మద్దా నరసయ్య గారికి విశాల భారతి నూతన సంవత్సర క్యాలెండర్ ను అందజేసిన విశాల భారతి ప్రతినిధులు.



# భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తా

- బీసీగా, ఓయూ విద్యార్థి నేతగా పార్టీని టికెట్ అడుగుతా
- టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఓయూ విద్యార్థి నేత, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీ, గౌడ సామాజిక వర్గానికి చెందిన స్థానికుడిగా, గత పాలకుల విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై ఓయూలో ఉద్యమాలు చేసిన నాయకుడిగా కాంగ్రెస్‌పార్టీని టికెట్ ఇవ్వమని అడుగుతానని ఆయన చెప్పారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ప్రజా ఉద్యమాల నిర్మాణంలో యాక్టీవ్‌గా ఉన్న నాలాంటి వ్యక్తికి అవకాశం ఇవ్వడంతో బీసీ వర్గాల్లో పార్టీకి మంచి పేరు వచ్చి బలోపేతమవుతుందని దయాకర్ గౌడ్‌అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా భువనగిరి పార్లమెంట్ పరిధిలో బీసీ జనాభా ఎక్కువగా ఉండడం, అందులో తాను గౌడ సామాజిక వర్గం కావడం కలిసివస్తుందన్నారు. పార్లమెంట్ సెగ్మెంట్లో 4 లక్షల గౌడ సామాజిక వర్గం ఓటర్లు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి నల్గొండ జిల్లాలో గౌడ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ ఎలాంటి అవకాశం ఇవ్వలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌పరిధిలోని 6 అసెంబ్లీల్లో గెలిచిందన్నారు. ఇప్పుడు మళ్లీ ఒక బీసీ అభ్యర్థి కి పార్లమెంట్‌కు అవకాశం ఇవ్వడం వలన పార్టీ కి బీసీ వర్గాల ఓటు బ్యాంకు మరింత దగ్గర అయ్యే అవకాశం ఉందన్నారు. దయాకర్‌గౌడ్‌ఉమ్మడి జిల్లాలోని నకిరేకల్ నియోజక వర్గానికి చెందిన వాడు కావడంతో పాటు.. నకిరేకల్ లో గౌడ్ జనాభాతో పాటు బీసీల సంఖ్య మెజారిటీగా ఉంది.

కాంగ్రెస్‌పార్టీ బీసీ యువతకు అవకాశం ఇచ్చి ప్రోత్సహిస్తే.. గెలుపు నల్లేరు మీద నడకేనన్న చర్చ పార్లమెంట్ నియోజకవర్గ నరిధిలో రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో నూ.. భువనగిరి ఎంపీగా బూర నర్సయ్య గౌడ్ టీఆర్ఎస్ తరపున గెలిచారు. అదే తరహాలో ఇతర పార్టీ లో కూడా బీసీలకే టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. అందుకే కాంగ్రెస్‌పార్టీ కూడా అదేవిధమైన నిర్ణయం తీసుకోవాలని దయాకర్‌గౌడ్ పార్టీ నాయకత్వాన్ని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2 ఎస్సీ స్థానాలు, ఒక ఎస్టీ కి దేవరకొండ, 8 స్థానాల్లో రెడ్లు పోటీ చేశారు. ఒక్క ఆలేరు బీసీకి కేటాయించారు. ఇప్పుడు భువనగిరి పార్లమెంట్ స్థానం బీసీకి కేటాయిస్తే బీసీలు శుభ పరిణామగా భావిస్తారన్నారు.

# రామ మందిరం.. ఒక సాంస్కృతిక చిహ్నం



- భౌతిక నిర్మాణం కాదు.. కళాకారుల కలల సౌధం
- 'కాలం ద్వారా ప్రయాణం' లో కళాకారుడు మంజునాథ్ రేవంకర్..



''అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ తేదీ దగ్గర పడుతుండగా, మన దేశం సామూహిక స్పృహలో నిక్షిప్తమై ఉన్న ఈ స్మారక నిర్మాణంపై నాకున్న ఆకర్షణ మూలాలను గుర్తుచేసుకుంటూ, నా మనస్సు జ్ఞాపకాల దొంతరలో 'నాస్టాల్జిక్ యాత్ర' ను ప్రారంభించింది. 33 ఏళ్ల కింద.. 1990 లో అయోధ్య రామమందిరం చర్చనీయాంశంగా మారి.. నాలో ఒక సృజనాత్మకతను వెలిగించినప్పుడు మొదలైన ప్రయాణం అది. ప్రస్తుతం ప్రైవేట్ రంగంలో బ్యాంకింగ్ ప్రొఫెషనల్‌గా ఉద్యోగం చేస్తున్నాను. అయితే ఈ నా కథ బ్యాలెన్స్ షీట్లు, ఆర్థిక లావాదేవీల గురించి కాదు.. పెయింటింగ్, మోడల్ మేకింగ్ కళ.. ఇది చిన్ననాటి నుంచి నా జీవితంలో అల్లిన అభిరుచికి సంబంధించినది.'' మహాఘట్టం సందర్భంగా.. ప్రముఖ కళాకారుడు మంజునాథ్ రేవంకర్.. కాలం ద్వారా ప్రయాణం 'విశాల భారతి'తో పంచుకున్న సందర్భం..

చిన్నప్పటి నుంచి పెయింటింగ్ సూక్ష్మ ప్రతిరూపాలను సృష్టించడం నేను ఎంచుకున్న వ్యక్తీకరణ మాధ్యమాలు. ఎలాంటి అధికారిక శిక్షణ లేకుండా, నేను వాటర్ కలర్లు , ఆయిల్ పెయింటింగ్‌లు , సరికొత్త కార్ల నుంచి పాత కాలపు ఆటోమొబైల్స్, బైక్‌లు, స్కూటర్లు, దేవాలయాలు, వాస్తు అద్భుతాల వరకు అన్నింటి నమూనాలను సూక్ష్మంగా రూపొందించాను. ఇది నా కళాత్మక ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన నా చుట్టూ ఉన్నవారి దృష్టిని ఆకర్షించే అభిరుచి.

**మలుపుతిప్పిన అయోధ్య**

990 లో జాతీయ చర్చల్లో అయోధ్య రామమందిరం అంశం ప్రధానాంశంగా మారడంతో కీలక మలుపు తిరిగింది. ప్రతిపాదిత ఆలయ నిర్మాణ వైభవం నా ఊహకు ఆజ్యం పోసింది. కేవలం ఛాయాచిత్రాల ఆధారంగా త్రీడీ ప్రతిరూప నమూనాను రూపొందించాలని నేను నిశ్చయించుకున్నాను.

నా బ్లూప్రింట్ ప్రకారం దాదాపు 120 పిల్లర్లతో 4 అడుగుల 3 అడుగుల మోడల్ రిఫరెన్స్ పాయింట్లు లేకపోవడం, ప్రాజెక్ట్ పూర్తి స్థాయిని లెక్కన ఇది చిన్న ఫీట్ కాదు. అచంచలమైన పట్టుదల, సహనంతో, నేను ఈ ప్రతిష్టాత్మక ప్రయత్నాన్ని ప్రారంభించాను. రెండు నెలల పాటు నిశిత శ్రమతో అయోధ్య రామ మందిరానికి ప్రతిరూపం రూపుదిద్దుకుంది.

పూర్తి చేసిన మోడల్, నా అంకితభావానికి నిదర్శనం, వివిధ షోకేస్‌లలో ప్రదర్శించాను. ఏది ఏమైనప్పటికీ, దాని నిజమైన వైభవం డిసెంబర్ 1990లో వచ్చింది. అది ఊరేగింపులో కేంద్రంగా మారింది. ఇది విస్తృతమైన దృష్టిని, ప్రశంసలను పొందింది. అయోధ్య రామమందిరం ప్రతిరూపం కేవలం కళాత్మక సృష్టి మాత్రమే కాదు.. ఇది చాలా మందికి ఆశ, విశ్వాసానికి చిహ్నంగా మారింది. వార్తా పత్రికలు, మీడియా పబ్లికేషన్లలో దాని ప్రాముఖ్యతను మరింత విస్తరించింది. ప్రజలు తమ ఆశీర్వాదాల వర్షం కురిపించారు. ఏదో ఒక రోజు, అది ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలయం వాస్తవానికి ఉన్నతంగా నిలుస్తుందని ఆశపడ్డారు. 33 ఏండ్లుగా వేగంగా ముందుకు సాగి, అయోధ్య రామమందిరాన్ని ప్రారంభించబోతున్నందున, నా ప్రారంభ కళాత్మక దృష్టి ప్రతిష్టాత్మకమైన జ్ఞాపకంగా మిగిలిపోయింది. కెరీర్ కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లిన తర్వాత, మోడల్‌కు 83 ఏండ్ల ప్రాక్టీస్‌లో ఉన్న డాక్టర్ అయిన మా నాన్న డా.బీఆర్ రేవంకర్‌లో సంరక్షకురాలిగా ఉన్నారు. ఆసుపత్రిలో సగర్వంగా ప్రదర్శించిన మోడల్ నిర్వహణపై అతని అంకితభావం, కళ శాశ్వత ప్రభావానికి తరాల మధ్య ఉన్న లోతైన అనుబంధానికి నిదర్శనం.

జనవరి 22న ఒక కల సాకారం కావడానికి దేశం సాక్షిగా, నా కథ భూత, వర్తమాన, భవిష్యత్‌ను వంతెన చేసే కళ శక్తికి వినయపూర్వకమైన రిమైండర్‌గా నిలుస్తుంది. అయోధ్య రామమందిరం భౌతిక నిర్మాణం కాదు.. ఇది ఒక సాంస్కృతిక చిహ్నం, కళాకారులు, విశ్వాసులు , నాలాంటి కలలు కనేవారిని మా ప్రత్యేక మార్గాల్లో సహకరించడానికి ప్రేరేపించింది. ఇది సమయం స్థలాన్ని మించిన అనుబంధాన్ని ప్రోత్సహిస్తుంది.

నోట్: వ్యాసంలో వ్యక్తీకరించిన అభిప్రాయాలు రచయిత అభిప్రాయాలు మాత్రమే. అవి ఏ ఇతర వ్యక్తి లేదా సంస్థ అభిప్రాయాలను ప్రతిబింబించవు.



# టైటానిక్ కంటే పెద్ద ఓడ.. జపాన్ లో పుట్టి.. గుజరాత్ లో ముక్కలైంది..

టైటానిక్ ఇంగ్లండ్ తీరాన్ని 1912లో విడిచిపెట్టినప్పుడు, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఓడ. దీని పొడవు దాదాపు 882 అడుగులు. కానీ ఈ ఓడ తన మొదటి ప్రయాణంలోనే మునిగిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు 1500 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత ప్రపంచం ప్రయాణీకుల పెద్ద ఓడలను సిద్ధం చేసే పని పక్కన పెట్టినట్టు కనిపించింది. అయితే, కార్గో కోసం పెద్ద ఓడల నిర్మాణం కొనసాగింది. 1979లో జపాన్ అలాంటి ఓడను నిర్మించింది, ఇది టైటానిక్ కంటే దాదాపు రెట్టింపు పొడవుతో ఉంటుంది. 30 సంవత్సరాల పాటు ఈ నౌక సముద్రాన్ని సరుకు రవాణాతో శాసించింది. ఈ భారీ ఓడ చివరకు భారతదేశంలోని గుజరాత్‌లో కనుమరుగైపోయింది.

అవును, జపాన్‌కు చెందిన సుమిటోమో హెవీ ఇండస్ట్రీస్ 19741979 మధ్యకాలంలో ప్రపంచంలోనే అతిపెద్ద నౌక 'సీవైజ్ జెయింట్'ను నిర్మించింది. దీనికి మొదట్లో ఈ పేరు లేదు. అయితే తర్వాత దీనికి ఒప్పామా, హ్యాపీ జెయిం, జహ్రే వైకింగ్ అనే పేర్లు కూడా వచ్చాయి. ఈ నౌ ప్రారంభం నుంచి అనేక వివాదాలతో ముడిపడి ఉంది.

**యజమాని దానిని తీసుకోవడానికి నిరాకరించడంతో..**

ఈ నౌక మొదటి నుంచి నొప్పులతోనే తన ప్రయాణం సాగించింది. ఈ ఓడ( జపాన్‌లోని ఒప్పామా షిప్‌యార్డ్‌లో తయారు అయింది. అయితే దాని గ్రీకు యజమాని దానిని తీసుకోవడానికి నిరాకరించాడు. అప్పటికి దానికి పేరు లేదు. అప్పుడు సుదీర్ఘ న్యాయ పోరాటం జరిగింది, ఆ సమయంలో షిప్‌యార్డ్ పేరు మీద ఒప్పామా అని పేరు పెట్టారు. తర్వాత షిప్‌యార్డ్ ఈ నౌకను చైనాకు చెందిన సి.వై.కి అప్పగించింది. దానిని తుంగ్‌కు విక్రయించారు. అతను దానికి 'సీవైజ్ జెయింట్' అని పేరు పెట్టాడు.

**ఇరాన్-ఇరాక్ యుద్ధం కారణంగా..**

ఈ నౌక(Big Ship) 'జహేరే వైకింగ్' పేరుతో అత్యంత ప్రజాదరణ పొందింది. దీని పొడవు దాదాపు 1500 అడుగులు. ఇది ప్రధానంగా చమురు ట్యాంకర్ల రవాణాలో ఉపయోగ పడింది. 1988లో, ఈ ఓడ ముడి చమురు రవాణా కారణంగా దాని జీవిత చక్రంలో అతిపెద్ద వైఫల్యాన్ని చవిచూసింది. అప్పుడు ఈ నౌక లారాక్ ద్వీపం వద్ద ఇరాన్ ముడి చమురును తీసుకువెళుతోంది. అప్పుడు సద్దాం హుస్సేన్ వైమానిక దళం దానిపై దాడి చేసింది. అది లోతులేని నీటిలో కొద్దిగా మునిగిపోయింది. అయితే, ఇది తరువాత రిపేర్లు జరుపుకుంది. తరువాత, 1991లో నార్వేజియన్ కంపెనీ దీనిని కొనుగోలు చేసింది. అందుకే దీనికి 'జహరే వైకింగ్' అనే పేరు వచ్చింది.

ఈ ఓడ 1991లో మళ్లీ అమ్మినపుడు దాని ధర సుమారు 40 మిలియన్ డాలర్లు. నేటి డాలర్ విలువ ప్రకారం చూస్తే దాదాపు రూ.330 కోట్లు ఉంటుంది. ఈ ఓడ(Big Ship) ప్రపంచంలోనే అతిపెద్ద స్వీయ చోదక నౌకగా పేరు పొందింది.

**గుజరాత్ లో కనుమరుగు..**

దాదాపు 30 సంవత్సరాల పాటు సముద్రాన్ని ఏలిన తరువాత, ఇది 2009 సంవత్సరంలో భారతదేశంలోని గుజరాత్‌కు చేరుకుంది. ఇక్కడ ఈ ఓడ( ప్రపంచంలోని అతిపెద్ద షిప్ బ్రేకింగ్ యార్డులలో ఒకటైన 'అలాంగ్'లో ముక్కలు అయిపోయింది. ఈ ఓడను విచ్ఛిన్నం చేయడానికి ఏడాది పొడవునా 1000 మంది కార్మికులు పని చేశారు. ఈ ఓడ యాంకర్ దాదాపు 36 టన్నులు.

**పెద్దది కావడమే శాపం..**

అయితే, ప్రపంచంలోనే అతి పెద్ద నౌకకావడం దానికి శాపంగా మారింది. ఈ నౌక ప్రపంచంలోని అనేక ప్రధాన వాణిజ్య మార్గాలను దాటలేకపోయింది. ఇందులో పనామా కెనాల్, సూయజ్ కెనాల్, ఇంగ్లీష్ ఛానల్ ఉన్నాయి.



# అయోధ్యకు మరో రెండు పేర్లు ఉన్నాయి.. ఏమిటో తెలుసా?

అయోధ్య నగరం ఉత్తరప్రదేశ్‌లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఎట్టకేలకు ఎన్నాళ్లుగానో ఎదురుచూసిన ఆ రోజు రాబోతోంది. జనవరి 22న అయోధ్యలో రామ మందిరంలో బాల రాముడ్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ ప్రత్యేక సందర్భంలో దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మీరు అయోధ్యకు వెళితే, కాన్ భవన్, హనుమాన్‌గర్హి, స్వర్గ ద్వారం, త్రేతా కే ఠాకూర్‌తో సహా అనేక దేవాలయాలు ఉన్నాయి. ఒక్కసారి మీరు అక్కడికి వెళ్ళిన తర్వాత మీకు తిరిగి రావాలని అనిపించదు.

ఏది ఏమైనప్పటికీ, అయోధ్య నగరం అందం గురించి ఎంత చెప్పినా తక్కువే. కానీ అయోధ్యకు వేరే పేర్లు కూడా ఉన్నాయని మీకు తెలుసా? ఇది చాలా మందికి తెలియదు. అయోధ్య హిందువుల ఏడు అత్యంత పవిత్ర స్థలాలలో ఒకటిగా పరిగణిస్తారు. అయోధ్యకు సంబంధించి వినని విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**ఇది కూడా అయోధ్య పేరు**

రాముడి నగరం అయోధ్య (Ayodhya Names) సరయూ నది తూర్పు ఒడ్డున ఉంది. రామాయణం ప్రకారం, అయోధ్యను మనువు స్థాపించాడు. అయోధ్యను 'దేవుని నగరం' అని కూడా పిలుస్తారని బహుశా మీకు తెలియకపోవచ్చు. అవును, అథర్వవేదం ప్రకారం, అయోధ్యను దేవుని నగరం అని పిలుస్తారు. ఇది కాకుండా, అయోధ్య పాత పేరు సాకేత్.

మీరు అయోధ్యకు వెళుతున్నట్లయితే, ఇక్కడ చూడవలసిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. ఇక్కడ మీరు కనక్ భవన్, హనుమాన్ గర్హి, త్రేతా కే ఠాకూర్, సీతా కీ రసోయి, హెవెన్స్ గేట్‌లను సందర్శించవచ్చు. ఇది కాకుండా, ఇక్కడ మీరు తులసి స్మారక్ భవన్ మ్యూజియం, రామ్ కథా పార్క్, బహు బేగం సమాధిని కూడా సందర్శించవచ్చు.

**ఆహారానికి కూడా ప్రసిద్ధి**

అయోధ్య సందర్శనకు మాత్రమే కాదు, ఆహారానికి కూడా గొప్ప ప్రదేశం. అవును, మీరు రుచికరమైన వంటకాలను రుచి చూడకపోతే, ఈ కింగ్ రామ్ నగరాన్ని సందర్శించడం వల్ల ప్రయోజనం ఉండదు. అయోధ్యలో ఒక ప్రత్యేకమైన లడ్డూను తయారు చేస్తారు. ఇది పూర్తిగా భిన్నమైన రుచిని కలిగి ఉంటుంది. ఇది కాకుండా, ఇక్కడ మీరు చాట్, దహీ భల్లా, దాల్ కచోరి, రబ్డీ వంటి వంటకాలను ప్రయత్నించవచ్చు.

కాబట్టి ఇప్పుడు మీరు అయోధ్య ఇతర పేర్ల గురించి కూడా తెలుసుకున్నారు. అయోధ్య వెళ్లి.. రాముని దర్శించుకుని.. అక్కడి అందాలను తనివితీరా చూసి.. మంచి ఫుడ్ ఎంజాయ్ చేసి వచ్చేయండి. అయోధ్యకు వెళ్లాలంటే బస్సు, విమానం లేదా రైలులో వెళ్లవచ్చు. ఇటీవల ప్రధాని మోదీ అయోధ్య విమానాశ్రయాన్ని కూడా ప్రారంభించారు.

# పీర్జాదిగూడలో ప్రజాధనం పక్కదారి...

- రూ.5 కోట్ల నిధులు గోల్ మాల్
- బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి డిమాండ్



**మేడిపల్లి, విశాల భారతి:** పీర్జాదిగూడ కార్పొరేషన్ లో రూ. 5 కోట్ల నిధులు గోల్ మాల్ అయినట్లు, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పీర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి డిమాండ్ చేశారు. భోజనాల ఖర్చు కింద రూ.3 కోట్లు, డంపింగ్ యార్డు సుందరీకరణకిందరూ.2కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలుచూపించి ప్రజాధనం పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఫైవ్ స్టార్ హోటల్ రేట్లు చూపుతూ భోజన బిల్లులతో చెల్లింపులు జరిపారా..? అని ప్రశ్నిస్తూ శుక్రవారం ఆయన మీడియాకు కార్పొరేషన్ లో నిధుల పక్కదారి పై వివరాలు తెలిపారు. పీర్జాదిగూడ మేయర్ కూడా కార్పొరేషన్ ను దివాలా తీయించాడని ఆరోపించారు. మేయర్అత్యుత్సాహంతో కోట్ల నిధులు దారి మళ్లించారని పేర్కొన్నారు.



# గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తా**

**కల్వకుర్తి, విశాల భారతి:** గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరాన్ని బట్టి గ్రామ అభివృద్ధికి విడతలవారీగా నిధులు మంజూరు చేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కల్వకుర్తి మండల పరిధిలోని బెక్కెర నూతన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవానికి కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యుడు పోతుంటే రాములు జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్లతో కలిసి గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బకర గ్రామ సర్పంచ్ పాండురంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సర్పంచ్ కోరిక మేరకు వారం రోజుల్లో బెక్కెరలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామపంచాయమానానికి స్థలాన్ని దానంగా ఇచ్చిన జంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మనోహర, జెడ్పిటిసి భరత్ కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో ఏసీబీ దాడులు

**లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా దొరికిన డివిజన్ సర్వేర్**




**కల్వకుర్తి, విశాలభారతి:** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే డిప్యూటీ భూ సర్వేయర్ అధికారి రమావత్ వస్య నాయక్ 8 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. వెల్దండ మండలం లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన రైతు సిరాజ్ తన పొలానికి సంబంధించిన భూమి సర్వే ప్రోసీడింగ్ కాపీ ఇవ్వాలని కోరారు. అందుకు ఎనిమిది వేల రూపాయలు లంచం ఇవ్వాల్సిందిగా అధికారి డిమాండ్ చేశారు. దీంతో ఇబ్బంది పడ్డ సిరాజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం ఏసీబీ అధికారులు వలపన్ని సర్వేయర్ వస్య నాయక్ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసిన ఎసిబి అధికారులు రమావత్ వస్య నాయక్ ను కోర్టులో హాజరు పరుస్తామని ఎసిబి డిఎస్పీ కృష్ణా గౌడ్ తెలిపారు.



# ఆత్మవిశ్వాసమే విజయానికి పునాది

**డాక్టర్ కొండా నాగేశ్వర్**

**ఓయూ,విశాలభారతి:** ఉస్మానియా యూనివర్సిటీ సివిల్ సర్వీస్ అకాడమీ మరియు టిఎస్ బీసీ స్టడీ సర్కిల్ ల సమన్వయ సహకారంలో కొనసాగుతున్న సివిల్ సర్వీస్ ఉచిత శిక్షణకు ఎంపికైన విద్యార్థులతో శనివారం ప్రారంభ కార్యక్రమాన్ని బీసీ స్టడీ సర్కిల్ బిల్డింగ్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ ముఖాముఖి నిర్వహించి, పలు అంశాలపై వారి సందేహాలను తీర్చారు . తదుపరి సివిల్స్ ఎలా ప్రిపేర్ కావాలి అనే అంశంపై ఓయూ సివిల్స్ సర్వీస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వర్ సుదీర్ఘంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు . ఈ సందర్భంగా డాక్టర్ కొండా మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం ప్రణాళిక బద్ధంగా, ఆత్మవిశ్వాసంతో, విశ్లేషణాత్మకంగా సబ్జెక్టు పై పట్టు సాధించడం ద్వారా సివిల్స్ లో విజయం సాధించవచ్చునని పేర్కొన్నారు. శత సంవత్సరాల ఉస్మానియా లో సివిల్స్ లో మరిన్ని ర్యాంకులు సాధించాలని విద్యార్థులను ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, బీసీ స్టడీ సర్కిల్ బాలకృష్ణన్, ఉదయ్, కృష్ణారావు , సిబ్బంది మరియు ఓయూ సివిల్ సర్వీస్ అకాడమీ కోఆర్డినేటర్ డా" విజయ్ కుమార్ , శ్రీనివాస్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ చైతన్య సదస్సు



**దర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలో దుబ్బాక గ్రామంలో శనివారం జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ సునీత కుంచాల , విశిష్ట అతిథి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగన్వార్, సీనియర్ సివిల్ జడ్జ్ పద్మావతి పాల్గొన్నారు.
అధికారులు ప్రజలకు న్యాయ సేవల గురించి, ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ.. గతంలో జరిగినటువంటి విడిసి చేసిన సామాజిక బహిష్కరణ గురించి గుర్తు చేశారు. గ్రామాలలో గ్రామ అభివృద్ధి కమిటీలు ఉండడం మంచిదైనప్పటికీ ఈ సామాజిక వర్గాన్ని బాధ పెట్టకుండా, కుల బహిష్కరణ జరగకుండా గ్రామంలో ఉన్న ప్రజల అందరికీ ఉపయోగపడేలా ఉండాలని ఆమె కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాలలో ఏదైనా సమస్య వస్తే వారు అక్కడే పరిష్కరించడం వల్ల పై అధికారుల వరకు ఆ సమస్య గురించి తెలియడం లేదు. అలాగే మా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని అందరికీ సమాన న్యాయం చేస్తామని ఆయన తెలిపారు. జిల్లా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. యువకులు తప్పుదారి పట్టకుండా ఉండాలని పిల్లలకు వారి తల్లిదండ్రులే క్రమశిక్షణ నేర్పించాలని.. అలాగే ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరు పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి సునీత కుంచాల, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగన్వార్, సీనియర్ సివిల్ జడ్జ్, సెక్రెటరీ పద్మావతి, ట్రైన్ ఐపీఎస్ చైతన్య, అదనపు డీసీపీ జయరాం,ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఏసిపి విజయ సారధి, తాసిల్దార్ మాలతి, ఎంపీపీ సారిక రెడ్డి, సర్పంచ్ వెంకటేష్,ఎంపీడీవో లక్ష్మణ్, సీఐ సైదా, ఎస్సై వంశీకృష్ణ, గ్రామపంచాయతీ సెక్రటరీలు గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

షాబాద్, విశాలభారతి: ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామ సర్పంచ్ కొలన్ ప్రభాకర్రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీరాముల వారి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతిఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రజలు దేవాలయాలవద్దకు వెళ్లినప్పుడు నిష్టతో పూజలు చేయాలన్నారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. మారుమూల గ్రామాల్లో ఇంత మంచిగా దేవలయాలు నిర్మించి పూజలు చేయడం అభినందనీయమని కొనియాడారు. వేద పండితులు అద్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులున్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

**షాబాద్, విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని చేవెళ్ల డివిజన్ ఎస్ఐ రాజేందర్, సీఆర్పీ యాదయ్య, డీసీపీయు అధికారి సంజీవ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లిలో ఆపరేషన్ స్మైల్ ఎక్స్ లో భాగంగా కుందన్ పరిశ్రమలో లేబర్ క్యాంపులో ఉన్న 17 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కూలీలలను పిల్లలను తల్లిదండ్రులతో, కంపెనీ వారితో మాట్లాడి చందనవెల్లి పాఠశాలలో చేర్చిచిన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మధ్యలో బడి మానేసిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. బడిడు కలిగిన పిల్లలను క్రమం తప్పకుండా పంపిస్తూ ప్రభుత్వ బడుల బలోపేతానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య,ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు అందిస్తున్నారని, చదువు యొక్క ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చాహేలీల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# రాముడి ప్రాణ ప్రతిష్ఠాపన రోజు పవిత్రమైనది

- ఈ నెల 22న రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించాలి
- హిందువుల మనోభావాలను కాంగ్రెస్ గౌరవించాలి
- విశ్వహిందూ పరిషత్ నాయకుల డిమాండ్

**విశాల భారతి, స్టేట్బ్యూరో:**

రాముడి ప్రాణ ప్రతిష్ట ఈనెల 22వ తేదీన జరగనుందని, ఇది దీపావళికి మించిన పవిత్ర దినమని విశ్వ హిందు పరిషత్ కార్యకర్తలు తెలిపారు. అయోధ్య రామ మందిరం ప్రారంభం సందర్భంగా ఈనెల 22వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించాలని విశ్వహిందు పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, రాష్ట్ర సహ కార్యదర్శి భాను ప్రసాద్, రాష్ట్ర సంపర్క్ ప్రముఖ్ వెంకటేశ్వర రాజు, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారికి వారు వినతిపత్రం అందజేశారు. జనవరి 22న హిందువులకు సరికొత్త పండుగ దినమని, దేవాలయాలు, మఠాలు, పీఠాలు వేడుకలకు ముస్తాబయ్యాయని వారు చెప్పారు. ప్రతి ఒక్కరూ పండుగ వాతావరణంలో ఆనందంగా గడపాల్సిన సమయమన్నారు. 22న కేంద్ర ప్రభుత్వం కూడా ఉదయం నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు సెలవు ప్రకటించిన విషయాన్ని వారు గుర్తుచేశారు. దేశంలోని అనేక రాష్ట్రాలలో సెలవు ప్రకటిస్తూ ఆయా ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయని, తెలంగాణ ప్రభుత్వం కూడా స్పందించి హిందువుల మనోభావాలను గౌరవిస్తూ అయోధ్యలో జరుగుతున్న బాల రాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా సెలవు ప్రకటించాలని విశ్వహిందూ పరిషత్ నేతలు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చెబుతామంటే ఆయన విదేశాల్లో ఉన్న నేపత్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు.



## బొడిగ గాలన్నకు నివాళి

**సైదాపూర్, విశాల భారతి:** చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ భర్త గాలన్నకు పలువురు నివాళులు అర్పించారు. మండలంలోని వెంకటేశ్వర్లపల్లికి చెందిన ఆయన శుక్రవారం మృతి చెందగా స్వగ్రామానికి ఆయన భౌతిక కాయాన్ని తీసుకువచ్చారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్, చొప్పదండి, మానకొండూరు ఎం ఏల్ ఏ లు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎం ఏల్ ఏ ఆరెపల్లి మోహన్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఆయనకు నివాళులు అర్పించారు.

# రామగిరి ఆలయానికి ఆశాదీప్ రెడ్డి రూ.3 లక్షల విరాళం





**కల్వకుర్తి, విశాల భారతి:** తండ్రి కాయితి ప్రభాకర్ రెడ్డి జ్ఞాపకార్థం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కాయితి ఆశాదీప్ రెడ్డి కల్వకుర్తి మండల పరిధిలోని రఘుపతి పేట రామగిరి సీతారామచంద్రస్వామి ఆలయానికి శనివారం రూ.3 లక్షలు విరాళం అందజేశారు. దేవాలయ అన్నదాన సత్రం కోసం నిధులను వెచ్చించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఆశాదీప్ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, దేవాలయ చైర్మన్ భీమయ్య, వైస్ చైర్మన్ వెంకట్ లు ఆలయానికి వచ్చిన ఆశాదీప్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హరీష్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, విజయ్ గౌడ్, అంజయ్య గౌడ్, పరశురాములు, రాజు, రేణుక, బాలస్వామి, అశోక్, హరీష్, ఆనంద్, వెంకట్ స్వామి గౌడ్, శేఖర్, జానకి, తదితరులు పాల్గొన్నారు.






# తలనొప్పి భారీంచలేక యువకుడు ఆత్మహత్య

**మేడిపల్లి,విశాలభారతి:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తలనొప్పి భరించలేక యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సింగ్ రావు తెలిపిన వివరాల ప్రకారం తండ్రి చిట్టీమల్ల వీరేశం(45), తల్లి నవీన(35) లకు కూతురు మానస,కొడుకు బాలరాజు (20), లు పీర్జాదిగూడ, 21వ డివిజన్, బుద్ధానగర్ మల్లికార్జున కాలనీ లో నివాసం ఉంటున్నారు, నవీర్ చదువుకుంటూ పార్ట్ టైం ఉద్యోగం చేసుకుంటున్నాడు. తల్లి దండ్రులు ప్రయివేట్ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. శనివారం అందరూ ఉద్యగాలకు వెళ్లగా ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడు తలనొప్పి భారీంచలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని ఉత్తరం రాసి చనిపోయాడు.కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ నర్సింగ్ రావు అన్నారు.



# ప్రొఫెసర్ నారాయణను పరిశోదన బాధ్యతల తొలగింపు

- పరిశోధన విద్యార్థులపై నారాయణ కక్ష
- ఆయన వేధింపులపై యూనివర్శిటీ కమిటీ
- సైకో ప్రొఫెసర్ నుంచి విముక్తి చెందమన్న విద్యార్థులు



**విశాలభారతి, ఓయూ :** గత సంవత్సర కాలంగా ఉస్మానియా యూనివర్సిటీపై ద్వేషం పెంచుకున్న అర్థశాస్త్ర హెచ్ ఓడి ప్రొఫెసర్ నారాయణ సైకోగా రూపాంతరం చెందాడని
అర్థశాస్త్ర విద్యార్థులు ఆరోపించారు. యూనివర్సిటీ యాజమాన్యంపై కక్ష తీర్చుకోవాలనుకున్న తన లక్ష్యాన్ని పరిశోధక విద్యార్థులపై ఎక్కుపెట్టినట్లుగా పేర్కొన్నారు. జేఆర్ఫ్ సాధించిన విద్యార్థుల పరిశోధన పత్రం కూడా సరిగా లేదని, సూపర్వైజర్ అట్లే తోటి ఆచార్యులు పరిశోధనలు మంచిగానే ఉన్నాయని వాకబు చెప్పినా కూడా తనకు నచ్చలేదన్నకారణంతో సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధింపులకు గురి చేశడని అవేదన వ్యక్తం చేశారు. వికలాంగులు, మహిళలను కూడా అగౌరవారికి గురి చేసి, మరికొందరి పరిశోధకుల నుంచి డబ్బులు కూడా వసూలు చేశాడు. దాదాపు 25 మంది పరిశోధక విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడాలని చూసే ప్రయత్నంలో యూనివర్సిటీ యాజమాన్య జోక్యం చేసుకుని కమిటీ వేసింది. ఆ కమిటి నారాయణ వేధింపులు నిజమేనని నిర్ధారణ చేసింది. అనంతరం యూనివర్సిటీ యాజమాన్యం ప్రొఫెసర్ నారాయణను తన పరిశోదన బాధ్యతల నుంచి తప్పిస్తూ ఆపై బాధ్యతలు డీన్ కు అప్పజెప్పడంతో ప్రొఫెసర్ నారాయణతో విముక్తి చెంది 20 మంది అర్థశాస్త్ర పరిశోధక విద్యార్థులు ఫ్రీ సబ్మిషన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్, రిజిస్టర్ లక్ష్మీనారాయణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గణేష్,ప్రొఫెసర్ డైసీ, ప్రొఫెసర్ రాములు,ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి కి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం నారాయణ పీడ వదిలినా, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని యూనివర్సిటీకి విజ్ఞప్తులు తెలిపారు. భవిష్యత్తులో ప్రొఫెసర్ నారాయణ లాంటి వాళ్లకు ఎలాంటి బాధ్యతలు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# అర్హులు భీమా చేసుకోవాలి

**బ్యాంక్ మేనేజర్ గుర్రాల ప్రవీణ్**

**శాలిగౌరారం, విశాలభారతి:** మూడు నెలల క్రితం గురజాల గ్రామానికి చెందిన దుబ్బాక సుజాత(49) అకాల మరణం చెందారు.ఈ సందర్భంగా స్థానిక ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ లో అకౌంట్ కలిగి ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా చేసుకుని ఉన్నారు. వారికి 2 లక్షల జీవన్ జ్యోతి భీమా చెక్ ను స్థానిక గ్రామీణ బ్యాంకు మేనేజర్ గుర్రాల ప్రవీణ్ శనివారం లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందచేశారు. అనంతరం మేనేజర్ మాట్లాడుతూ భీమా సదుపాయాన్ని అందరూ ఉపయోగించుకోవాల న్నారు . ఒక సంవత్సరానికి 456 రూపాయలు కడితే 4 లక్షల ప్రమాద భీమా ఉంటుందని తెలిపారు.గ్రామీణ బ్యాంకు యొక్క సదుపాయాలు రుణాల మంజూరు గురించి తెలియ చేశారు .ఈ కార్యక్రమంలో క్యాషియర్ కోటేశ్వరరావు, స్థానిక బిజినెస్ కరస్పాండెంట్ హమీద్, గ్రామస్థులు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.





# రెండు పడకల ఇండ్లను అర్హులకు పంచాలి

**సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు**

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లా కేంద్రంలో రెండు పడకల గదుల ఇండ్ల కేటాయింపులో నిజమైన లబ్ధిదారులకు కాకుండా ఇండ్లు ఉన్న వారికి ఇవ్వటం జరగాయని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్లో ఏవో సుదర్శన్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం డ్రా పద్ధతిలో చేపట్టిన రెండు పడకల ఇండ్లను గత సంవత్సరం అక్టోబర్లో డ్రా పద్ధతి ద్వారా లబ్ధిదారులను వార్డు కౌన్సిలర్ వారికి నచ్చిన వారిని ఎన్నుకోవడం జరిగిందని ఆయన అన్నారు. అలా కాకుండా ప్రభుత్వ నిబంధన ప్రకారం అధికారులను నియమించి రీ ఎంక్వయిరీ చేయించి అసలైన లబ్ధిదారులను గుర్తించి వారికి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంపికైన లబ్ధిదారులకు పట్టాలు పంచారు గాని ఇప్పటివరకు వారికి గదులను కేటాయించడంలో జాప్యం జరిగిందని, లబ్ధిదారులను గుర్తించి వారికి గదుల కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకా పూర్తికాని రెండు పడకల గదుల ఇళ్లను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, మురగండ్ల లక్ష్మయ్య, నిమ్మల ప్రభాకర్, రేగటి లింగయ్యలు పాల్గొన్నారు.

# అధికారులు చొరవ తీసుకోవాలి

**- సర్పంచ్ గుర్రం నీలిమా గాంధీ**



**నడిగూడెం, విశాలభారతి:** గ్రామపంచాయతీ. రికార్డులు అప్పగించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని సర్పంచ్ గుర్రం నీలీమాగాంధీ కోరారు. శనివారం కరివిరాల సర్పంచ్ గుర్రం నీలిమాగాంధీ పాత్రికేయులతో మాట్లాడుతూ కరివిరాల గ్రామ కార్యదర్శిగా పనిచేసిన నాగరాజు బదిలీపై పాలకీడు మండలానికి వెళ్లడంతో 29 డిసెంబర్ 2023న కరివిరాల గ్రామ ఇంచార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శికి బదిలీపై వెళ్లిన నాగరాజు రికార్డులు అప్పగించ పోవడంతో పాలన పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కార్యదర్శి గదికి తాళం వేసుకొని వెళ్లారని తాళం చెవి కూడా అప్పగించక పోవడంతో శనివారం నిర్వహించిన గ్రామ సభ కూడా ఆరు బయట నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రికార్డులు అప్పగించ పోవడంతో గ్రామాభివృద్ధి కుంటిపడిందన్నారు. రికార్డులు అప్పగింతపై జిల్లా అడిషనల్ కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా సమస్యను పరిష్కరించాలని డిపిఓ యాదయ్యను అడిషనల్ కలెక్టర్ ఆదేశించిన డిపిఓ సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫోన్ చేసినా స్పందించడం లేదని తెలిపారు.



# గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

**డిఎఫ్ఓ సతీష్ కుమార్.**

**నడిగూడెం, విశాలభారతి:** గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి, డీఎఫ్ఓ సతీష్ కుమార్ అన్నారు.మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం నందు శనివారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ 2024 25 ఆర్థిక సంవత్సరానికి గ్రామపంచాయతీ డెవలప్మెంట్ కార్యక్రమం కింద చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంతో వ్యవహరించవద్దని సూచించారు. సమావేశంలో తాసిల్దార్ హేమమాలిని, ఎంపీడీవో సయ్యద్ ఇమామ్,వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# అక్రమ రవాణాను అరికట్టాలి..!

**ఎఫ్ ఎం ఎం సోషల్ సర్వీస్ మండల కోఆర్డినేటర్ ఎన్ శిరీష**

**మరిపెడ,విశాల భారతి:** మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ మండల ఫీల్డ్ కోఆర్డినేటర్ నిరుడు శిరీష అన్నారు. శనివారం మండలంలోని అబ్బాయి పాలెం గ్రామంలో మానవ అక్రమ రవాణా పై అవగాహన సదస్సు ఝాన్సీ లక్ష్మీబాయి గ్రామైక్య సంఘం సిఎ తీగల లలిత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి నిరుడు శిరీష పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకూడదని చట్టరీత్యా నేరమని మహిళలకు సూచించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను హింసలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వేధింపులు జరిగినప్పుడు క్రైమ్ బ్రాంచ్ కి ఫిర్యాదు చేయాలన్నారు. అపరిచిత వ్యక్తుల ప్రవర్తన పట్ల ఏమాత్రం అనుమానం ఉన్న ఫిర్యాదు చేయాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 100,1098,1930, మహిళా రక్షణ కోసం సమాచారంఅందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చన్న, గ్రామ వార్డు సభ్యురాలు ఎస్ కె చాందిని, మహిళా సంఘం నాయకురాలు పోలేపొంగు నాగమణి, తీగల ఏకమ్మ, జనక వెంకటమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.



# అభివృద్ధి పథంలో నడిపిస్తాం

**మణుగూరు పట్టణ అధ్యక్షులు లింగంపల్లి రమేష్**

**మణుగూరు, విశాలభారతి:** అభివృద్ధి పథంలో నడిపిస్తాం అని అభివృద్ధి పథంలో నడిపిస్తాం అని మణుగూరు పట్టణ అధ్యక్షులు లింగంపల్లి రమేష్ అన్నారు. శనివారం నాడు మణుగూరు రైల్వే స్టేషన్ అధికారిని కలిసి భారతీయ జనతా పార్టీ మణుగూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీలో నామినేటెడ్ అయినా మణుగూరు పట్టణ అధ్యక్షులు లింగంపల్లి రమేష్ మణుగూరు మండల అధ్యక్షులు కుంజా రామకృష్ణ. జిల్లా కార్యదర్శి ముత్యాల వెంకటేశ్వరరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, నామినేటెడ్ అయినా పత్రాలు మణుగూరు రైల్వే అధికారికి అందజేసారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు మాట్లాడుతూ రైల్వేకు సంబంధించిన అభివృద్ధి పనులలో మేము ముందుండి ప్రయాణికులకు కావలసిన అన్ని సౌకర్యాలు చూసుకుంటామని అన్నారు. అదేవిధంగా గతంలో మణుగూరుకొచ్చిన అన్ని రైళ్లను తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని అన్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా రైల్వే వారితో మాట్లాడి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని రైల్వే ప్రయాణికులకు తెలియజేస్తున్నాం అని తెలిపారు. అదేవిధంగా మా సేవలను గుర్తించిన భారతీయ జనతా పార్టీ జిల్లా రాష్ట్ర నాయకత్వానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నాకు ఇచ్చిన బాధ్యత పట్ల పార్టీ పట్ల పూర్తి విశ్వాసంతోని వినయ విధేయతలతో మా వంతు బాధ్యత నిర్వహించడంలో ముందుంటామని ఈ సందర్భంగా మణుగూరు ప్రజానీకానికి తెలియజేశారు.



# భూదేవి నగర్ కు అంగన్వాడీ మెయిన్ సెంటర్

**భద్రాచలం, విశాలభారతి:** స్థానిక రాజుపేట కాలనీ భూదేవి నగర్ నందు ఉన్న అంగనవాడి మినీ సెంటర్ ని మెయిన్ సెంటర్ గా చేసినందుకు అభినందనలు తెలియజేస్తున్నామని ఎండి ముంతాజ్ అన్నారు. ఈ సందర్భంగా అంగనవాడి కేంద్రంలో కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. అనంతరం ముంతాజ్ మాట్లాడుతూ.. రాజుపేట కాలనీ భూదేవి నగర్ లో అనేక సంవత్సరాల నుంచి తిరుపతమ్మ అనే అంగన్వాడి టీచర్ 100 రూపాయల నుంచి 1500 రూపాయల వరకు అద్దె చెల్లిస్తూ సొంత ఖర్చులతో కూడా మినీ అంగనవాడిని అనేక కష్టాలు పడుతూ నడిపించుకుంటూ వచ్చిందని ఈ కాలనీ గర్భిణీ స్త్రీలు పిల్లలకు ప్రభుత్వం నుంచి మంజూరైన పోషక పదార్థాలను ఆహారాన్ని వారికి అందించడంలో ఎనలేని కృషి చేసిందని ఇంటింటికి వెళ్లి పిల్లలను పిలిపించి అంగన్వాడి సెంటర్ ను అభివృద్ధి చేసిందని అంగనవాడి టీచర్ చేసిన సేవను అభినందించారు. అందుకనే భూదేవి నగర్ మినీ సెంటర్ మెయిన్ సెంటర్ అయ్యేందుకు ఆమె కృషి ఎనలేనిదని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు, పిల్లలు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ రామ విజయ సంకల్ప యాత్ర

**ఘన స్వాగతం పలికిన మహిళ భక్తులు**

**సూర్యాపేట, విశాలభారతి:** అయోధ్యలో జనవరి 22 వ తేదిన శ్రీ రామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్న సందర్భంగా సూర్యాపేట పట్టణంలో దేవాలయాలు, ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ రామ విజయ సంకల్ప యాత్ర పేట జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా శోభాయమానంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజారు వేదాంత భజన మందిరం వద్ద శోభాయాత్రను ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా మహదేవ్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వర రావులు ప్రారంభించారు. అనంతరం సూర్యపేట జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా సాగిన శోభాయాత్రకు మహిళలు వీధివీధిన నీలారబోసి మంగళహారతులు పట్టి ఘన స్వాగతం పలికి తమ భక్తిని చాటుకున్నారు. బొడ్రాయి బజార్ నుండి పూలసెంటర్ మీదుగా శోభాయాత్ర అలంకార్ సెంటర్ నుండి వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం మీదుగా విద్యానగర్ కొత్త బస్టాండ్ మీదుగా బతుకమ్మ చౌరస్తాకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో సుధాకర్ పివిసి ఎండి మీలా మహదేవ్, అయోధ్య తీర్థ క్షేత్ర జిల్లా సంయోజక్ పర్వతం శ్రీధర్, వేదాంత భజన మందిరం కమిటీ అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర్ రావు, అయోధ్య తీర్థ క్షేత్ర జిల్లా బాద్యులు మాదిశెట్టి విజయ్ కుమార్, గట్ల సోమయ్య, నాగవెల్లి ప్రభాకర్, ఎన్.రవిచంద్ర, దినేష్ బాబు, తోట శ్యామ్ ప్రసాద్, రాచర్ల కమలాకర్, కక్కిరేణి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



# వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**శాలిగౌరారం, విశాలభారతి:** మండలంలోని గురజాల గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు, వితంతువులకు,దుప్పట్లను లయన్స్ క్లబ్ జిల్లా జిఎస్టీ కోర్డినేటర్,జెల్లా దశరథ పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 210 దేశాల్లో విస్తరించిన లయన్స్ క్లబ్ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిత్యం ఎన్నోసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు . క్లబ్ అధ్యక్షులు మారం వేణుగోపాలరెడ్డి, సర్పంచ్ గుండా శ్రీనివాస్, క్లబ్ చార్టర్ ప్రసిడెంట్ బుడిగె శ్రీనివాసులు,మాజీ జోనల్ ఛైర్మెన్ ఎర్ర శంబులింగారెడ్డి ,క్లబ్ కార్యదర్శి బచ్చు ఆంజనేయులు, జిల్లా లయన్స్ పెద్దలు తుమ్మలూరి మురళీధర్ రెడ్డి, చెరుపల్లి కృష్ణయ్య, పంచాయితీ కార్యదర్శి మహేష్, మూడ రమేష్, గూని గంగ రాములు పాల్గొన్నారు.



# ఆదివాసీలు అభివృద్ధి చెందాలి

- **నూతన వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వండి**
- **ఉమేష్ చంద్ర నగర్ లో సీఐ శివప్రసాద్**

**పినపాక , విశాలభారతి :** ఆదివాసీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని సీఐ శివ ప్రసాద్ తెలియజేశారు. శనివారం పినపాక మండల పరిధిలోని ఉమేష్ చంద్ర నగర్ ఆదివాసి గ్రామంలో ఆయన పర్యటించి వారికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పోలీసులు మీకోసంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమాజాహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆదివాసీలు అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. ఆదివాసి గ్రామాలలో ప్రస్తుతం మిరప కోతలు జరుగుతున్న తరుణంలో కొత్త వ్యక్తులు వచ్చిన, అనుమానిత వ్యక్తుల సమాచారం ఉన్న పోలీసులకు అందించాలని కోరారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ వద్దని అవగాహన కల్పించారు.కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రంథాలయ నిర్మాణానికి ఆర్థికసాయం

**నాగారం ,విశాలభారతి:** మండలంలోని ఈటూరు గ్రామంలో ప్రతిభ యూత్ అసోసియేషన్ అద్వర్యంలో నిర్మిస్తున్న అంబేద్కర్,పూలే అధ్యయన వేదిక నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన మహంకాళి సోమన్న తన వంతుగా 7 వేల రూపాయల ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ తన బాల్యం అంత పశుల కాపరిగా ఉండి చదువుకు దూరం అయ్యానని,నాలాగా కాకుండా నేటి తరం అంత చదువుల్లో రానించాలనే ఆలోచనతోనే తన వంతుగా గ్రంథాలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం చేశానన్నారు.చదువు విలువ తెలుసుకుని ప్రతి ఒక్కరు కూడా గ్రంథాలయ నిర్మాణానికి సహకారం అందించి పిల్లలను చదువులో ముందు వరసలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ఈ చదువుకి దూరం అయ్యి చదువు విలువ తెల్సుకుని గ్రంథాలయనికి సహకరించిన సోమన్న ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ యూత్ అధ్యక్షులు బోడ పరాశరాములు. యూత్ సభ్యులు వంగూరి సుధాకర్, వంగూరి ఉపేందర్,యల రవి,వంగూరి ఎల్లేష్,గట్ట గాళ్ల శ్రీను,గుడిపాటి పరాశరాములు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా నవోదయ పరీక్ష



**కోదాడ, విశాలభారతి:** పట్టణంలోని సిసి రెడ్డి పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో శనివారం జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించినట్లు కోదాడ మండల విద్యాధికా సలీం షరీఫ్ తెలిపారు. 202425 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశం పొందేందుకు ప్రస్తుత సంవత్సరం ఐదవ తరగతిలో ఉండి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలో 201 మంది విద్యార్థులకు గాను 37 మంది గైర్హాజరు కాగా 164 మంది హాజరయ్యారు. సెయింట్ జోసెఫ్ సీసీ రెడ్డి పాఠశాలలో 216 మంది విద్యార్థులకు గాను 36 మంది గైర్హజరుకాగా 180 మంది హాజరయ్యారు అని తెలిపారు.

# గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి

**వాజేడు, విశాలభారతి:** మండల కేంద్రంలోని పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్నత అధికారుల సూచనల మేరకై టేకులగూడెం గంగారం మరియు కృష్ణాపురం గ్రామాల్లో అనుమానిత ఇండ్లలో సోదా చేయగా కృష్ణాపురం గ్రామపంచాయతీలో ప్రభుత్వం నిషేధించిన గుడుంబా నాటు సారా అమ్ముతుండగా ఇద్దరు వ్యక్తులను పట్టుకోవడం జరిగింది. కృష్ణాపురం గ్రామానికి చెందిన బలుసు పాటి లక్ష్మయ్య గంగారం గ్రామానికి చెందిన ఇర్ప ప్రణీత్ మరియు టేకులగూడెం గ్రామానికి చెందిన కురుసం సన్యాసి చత్తీస్గడ్ రాష్ట్రం నుండి నిషేధించిన 60 లీటర్ల నాటు సారా అమ్ముతుండగా పేరూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమేష్ స్టేషన్ సిబ్బంది మరియు సిఆర్ఎఫ్ పార్టీ పట్టుకొని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగింది .ఈ ముగ్గురు వ్యక్తులు మరల అమ్మకుండా వాజేడు మండలం ఎమ్మార్వో ముందు బైండోవర్ చేశారు.





# వైద్య సేవల పరిరక్షణ కోసమే జన ఆరోగ్య సమితి

**సర్పంచ్ తీగల కరుణ శ్రీ గిరిధర్ రెడ్డి**

**నూతనకల్, విశాలభారతి:** క్షేత్రస్థాయి వైద్య సేవల పరిరక్షణ కోసమే జన ఆరోగ్య సమితి ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి నెలలో నిర్వహించే జన ఆరోగ్య సమితి సమావేశంలో ప్రజల కందే వైద్య సేవలపై ఎలాంటి సమస్యలు ఉన్న తెలియజేయాలని స్థానిక సర్పంచ్ తీగల కరుణశ్రీ గిరిధర్ రెడ్డి అన్నారు.శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహించిన జన ఆరోగ్య సమితి సమావేశంలో పాల్గొని మాట్లాడారు.ప్రజల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,ఉప కేంద్రాలలో నిర్వహించే అన్ని రకాల సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ఆరోగ్య జన సమితి కి తెలియపరచాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి,హెల్త్ అసిస్టెంట్ నాగేష్,నూతనకల్, యడవెల్లి గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# బాలికల వసతి గృహాన్ని ప్రారంభించాలి

- వసతి గృహం ముందు ధర్నా నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నేతలు
- విద్య రంగంలో వెనుకబడిన డోర్నకల్ మండల కేంద్రం
- డీఈవో రామారావు గారి పై చర్యలు తీసుకోవాలి
- హెచ్చరించిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెలోత్ సాయి కుమార్
- డోర్నకల్ ఇంఛార్జి గుగులోతు సూర్య ప్రకాష్.

**డోర్నకల్, విశాలభారతి:** ప్రభుత్వ పాటశాలలు ప్రారంభమై అర్ధ సంవత్సరం గడుస్తున్న కూడా విద్య రంగ సమస్యలు పరిష్కరించడంలో జిల్లా విద్యాధికారులు విఫలం అయ్యారు అని వారు తెలిపారు. బాలికల వసతి గృహం తెరవక ప్రతిరోజూ విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ,కానీ ప్రభుత్వ అధికారుల్లో ఎలాంటి చలనం లేదని స్పష్టం చేశారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుండి చిలుకొడు మోడల్ స్కూల్ పై జిల్లా కలెక్టర్ కి, డీఈఓ కి పలుమార్లు వినతిపత్రం అందజేసిన పలితం లేదని, ఆ వినతి పత్రాలు చెత్త బుట్ట లో వేస్తున్నారు తప్ప సమస్యను పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. మేడి పండు చూడు మెలిమై వుండు పొట్ట విప్పి చూడు పురుగులు వుండు అన్నట్టు పేరుకే ఆదర్శ పాఠశాల కానీ లోపల చూస్తే సమస్యలతో నిండిపోయాయి అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్, సౌమ్య, నీహారిక విద్యార్థినులు పాల్గొన్నారు.






# మహిళల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సొంత నిధులతో 33 మంది మహిళలకు
- కుట్టు మిషన్ల పంపిణీ

**పటాన్ చెరు, విశాలభారతి:** నియోజకవర్గం పరిధిలోని మహిళల ఆర్థిక అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు వడ్డెర సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సొంత నిధులతో కొనుగోలు చేసిన 33 కుట్టుమిషన్లను మహిళలకు పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డి సొంత నిధులతో కొనుగోలు చేసిన 3 ఆటోలను యువకులకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించిన జరిగిందని తెలిపారు. ప్రజల ఆశయాలు ఆకాంక్షలకు అనుగుణంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నామని తెలిపారు. మహిళా సంక్షేమానికి హామీలు గుప్పించి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలుకు సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కౌన్సిలర్ శ్రీశైలం, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# ఓటర్ నమోదుకు ప్రోగ్రాంను విజిట్ చేసిన కలెక్టర్

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ స్పెషల్ క్యాంపెయిన్ ప్రోగ్రామ్ను విజిట్ చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ ఓటర్ నమోదు పేరు డబ్లికేటీ ఓట్లు పేరు సవరించుట, అడ్రస్సు మార్పులు. ఈ నెల 22 వరకు అవకాశముందని తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాతో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. జనవరి 1 నాటికి 18 ఏండ్లు పూర్తయిన వారందరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం సద్విని చేసుకోవాలని,కొత్త ఓటరు నమోదు కోసం ఈ నెల 20, 21, 22 తేదీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్మెట్ మండల్ ఎమ్మార్వో రవీందర్ దత్తు, ఆర్డీఓ, అనంతరెడ్డి,కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, అధికారులు తదితరులు పాల్గొన్నారు



# శరవేగంగా అభివృద్ధి పనులు'

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి 22వ వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొశికే ఐలయ్య అన్నారు. శనివారం కమ్మగూడ రాజ్ రంజిత్ కాలనీ, నవభారత్ కాలనీ, ప్రగతి నగర్, న్యూ ప్రగతి నగర్ కాలనీల్లో రూ.33లక్షలతో చేపట్టిన బీటీ రోడ్లు, సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఐలయ్య శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి సహకారంతో తమ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్లు ప్రాధాన్య క్రమంలో వేయిస్తున్నట్లు తెలిపారు. నాలుగన్నరేళ్లలో వార్డులోని అన్ని కాలనీలకు నిధులు కేటాయించి, పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ రంజిత్ కాలనీ ప్రెసిడెంట్ ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరిరెడ్డి, నవభారత్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, మనోహర్, ప్రగతి నగర్ వాసులు తిరుపతి రెడ్డి, మురళి, అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**ఎల్బీనగర్, విశాలభారతి:** గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని సరూర్ నగర్ చెరువు కట్ట క్రింద జరుగుతున్న టన్నలింగ్ పనులను ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గడ్డిఅన్నారం డివిజన్ లో వరద నీటి సమస్యలు తీర్చే ప్రయత్నంలో బాగంగా టన్నలింగ్ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తి అయితే గడ్డిఅన్నారం డివిజన్ వాసులకు వరదనీటి నుంచి పూర్తి స్థాయిలో సమస్యలు తీరుతాయన్నారు.ఈ కార్యక్రమంలో భవాని ప్రవీణ్ కుమార్,రమేష్ ముదిరాజ్,రమణ రెడ్డి,ప్రదీప్,విక్కీ మరియు అధికారులు ఇరిగేషన్ డి.ఈ.పవన్ కాంట్రాక్టర్ రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.





# మానవాళికే బట్టను పరిచయం చేసిన ఘనత పద్మశాలీలదే

- ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు కృషి
- శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధన, పద్మశాలీల చేనేత కుటుంబాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తది చేస్తుందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు.రాష్ట్రంలోని ప్రతి పద్మశాలిని కలిసి చైతన్యం చేయాలని కోరారు. శనివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైటెక్ సిటీ పద్మశాలి సంఘం అధ్యక్షులు గంజి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశాలి సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకార, 2024 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ స్థాపించిన రాజమొహల్లా పద్మశాలి భవన్ కేంద్రంగా రాష్ట్ర వ్యాప్త కార్యాచరణ ప్రణాళికతో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.
నూతనంగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గం ప్రతి పద్మశాలిని చైతన్యవంతం చేయాలని కోరారు.ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవిని తృణ ప్రాయంగా పదవికి రాజీనామా చేసిన బహుజన బిడ్డ బాపూజీ అని ఆయన సేవలను కొనియాడారు.1941 సంవత్సరంలో చేనేత సహకార సంఘాల వ్యవస్థను పటిష్ట పరచారు.బాపూజీ ఆశయ సాధనకోసం ఎప్పటికప్పుడు ప్రభుత్వంతో సంప్రదించి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. సంఘటితంగా పద్మశాలీలు అందరూ కదలాలని పిలుపునిచ్చారు.ఈ మేరకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గంజి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, గౌరవ అధ్యక్షులు మెరువ సత్యనారాయణ,కోశాధికారి చెన్న రాము,ఉపాధ్యక్షులు గడ్డం వెంకటేష్,పాలాది ప్రభాకర్,సిలివేరు మహేష్, కుకుడాల ఆంజనేయులు, శ్రీదేవి వైద్య,ముఖ్య సలహాదారులు బొల్లి కృష్ణహరి, పండాల నరసింహులు,సలహాదారులు,చింతకింది విటల్,మోత్కూర్ విజయలక్ష్మి,న్యాయ సలహాదారులు అనిల్ వైద్య,ఆర్థిక సలహాదారులు గంజి సాయి కృష్ణ,కార్య నిర్వాహక కార్యదర్శి గద్దె శ్రీనివాస్,పులిజాల శివప్రసాద్, ఆడెపు మల్లేష్,గంజి అనురాధ, సాంస్కృతిక నిర్వాహకులు తిరుమల రఘురామ్, ప్రచార కార్యదర్శి,గడ్డం సురేష్,గద్దె జ్యోతి,తాటి విజయలక్ష్మి కార్యదర్శి కరుణాతం మునిందర్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నేపల్లి సాంబశివరావు, గోపాల్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# రామరాజ్య స్థాపన కోసం నరేంద్ర మోడీ కృషి

**బిజెవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్**

**కూకట్ పల్లి, విశాల భారతి:** ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ హనుమాన్ దేవాలయంలో డివిజన్ అధ్యక్షులు కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ అయోధ్యలో రాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం దేశంలో ఒక యజ్ఞం లాగా జరుగుతుంద అన్నారు. ప్రజలందరూ భాగస్వామ్యం కావడం ప్రపంచానికి గొప్ప సందేశాన్ని పంపినట్టుగా ఉన్నది అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రధాని నరేంద్ర మోడీ ధన్యవాదాలు తెలిపారు . స్వచ్ఛమైన వాతావరణంలో స్వచ్ఛమైన మనసుకలిగిన రాముని ప్రతిజ్ఞ జరగడం కోసం ఆలయాలను శుద్ధి చేసుకొని, పరిసరాలను పరిశుభ్రంగా చేయాలని మోడీ ఇచ్చిన ఒక్క పిలుపుతో ప్రజలందరూ పాటించడం చాలా సంతోషంగా ఉన్నది అన్నారు. స్వచ్ఛ ప్రభుత్వన్నిన డుపుతూ దేశంలో రామరాజ్యం స్థాపించడం కోసం నిరంతరం కృషి చేస్తున్నాడు అన్నారు. అందుకోసం మనమంతా మద్దతుగా నిలుద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు,మహిళ మోర్చ నాయకురాలు స్రవంతి, నాయకులు నర్సింహ రెడ్డి, రమేష్, రాజు జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సెంట్ మైకేల్స్ స్కూల్ లో గణిత ఎగ్జిబిషన్

**కూకట్ పల్లి, విశాలభారతి:** పాఠశాలలో సైన్స్, గణిత ఎగ్జిబిషన్లను నిర్వహించడం విద్యార్థులకు ప్రయోజనకరంగా మారాయి. విద్యార్థులు ఇట్టి ఉత్సవలలో పాల్గొని తమ ప్రతిభా, నైపుణ్యతలను కనబరిచారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడం శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా ఏటా సెంట్ మైకేల్స్ స్కూల్ నిర్వహించే గణితం ఎగ్జిబిషన్ లో విద్యార్థిని, విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. శనివారం ఓల్డ్ ఆల్వాల్ పరిధిలోని సెంట్ మైకేల్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శీతల్ శర్మ, జి.ఎమ్. సునీల్ కమ్మెట అద్వర్యంలో మెథలెటిక్స్ మ్యాథ్స్ ఎగ్జిబిషన్ చాల ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని చిన్నరుల ప్రాజెక్టులు సందర్శకుల అందరిని ఆకర్షించాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల అధ్యాపకులు, నాలుగు పాఠశాల విద్యార్థులు, మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చెట్లకు నిప్పులు పెట్టిన ఆకతాయిలు

**కాలిపోయిన చెట్లను పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

**కూకట్ పల్లి, విశాల భారతి:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ ఫేస్ 2 లో గల బతుకమ్మ పార్క్ పరిసరాలలో ఉన్న స్థలంలో కొంతమంది ఆకతాయిలు నిప్పు పెట్టడంతో చెట్లు కాలిపోయిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శుక్రవారం అర్బన్ హెచ్ ఎ నాగరాణి తో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గతంలో క్వారీ గుంత ఉండేదని, గుంతను పూడ్చి మూడువేల పైచిలుకు మొక్కలతో ఉద్యానవనంగా తీర్చిదిద్ది సుందరికరించడం జరిగిందని గుర్తుచేశారు. ఈ మధ్యకాలంలో ఆకతాయిలు మరియు గంజాయి తాగే బ్యాచ్ లు మోహరించి ఉద్యనవనాన్ని పాడుచేస్తున్నారని, కాబట్టి విషయాన్ని శేరిలింగంపల్లి శాసనసభ్యులు ఆరేకపూడి గాంధీ, సంబంధిత అధికారుల దృష్టికి తెలుకువెళ్లి ఉద్యానవనం చుట్టూ ఫేనిసింగ్ మరియు ముఖద్వారం గేట్ ఏర్పాటుచేసేలా చూస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో



డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు చిన్నోళ్ల శ్రీనివాస్, రామస్వామి, షకీల్ మున్నా, సలీమ్, భిక్షపతి, మోజెస్, పోశెట్టిగౌడ్, సాయి గౌడ్, మహిళా గౌరవ అధ్యక్షురాలు మధులత, నస్రీన్, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.



# ఫతేనగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

**కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**

**కూకట్ పల్లి, విశాల భారతి:** నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఫతేనగర్ డివిజన్ ను వేగవంతంగా అభివృద్ధి చేసున్నామని స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నేతాజీ కా జరుగుతున్న పైప్లైన్ రోడ్ అభివృద్ధి పనులను శనివారం జిహెచ్ఎంసి ఏఈ పవన్, జవాన్ పోచయ్యతో కలిసి పర్యావేక్షించారు. సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో చేపట్టిన స్ట్రాం వాటర్ డ్రైన్, వీడీసీసీ రోడ్ పనులు పూర్తి కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వెంటనే కార్పొరేటర్ స్థానిక ప్రజలతో మాట్లాడి నేరుగా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తు అందుకు తగినట్లుగా డివిజన్ లోని ప్రతి కాలని, బస్తీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో అవసరమైన నిధులను ఎప్పటికప్పుడు కేటాయిస్తున్నారని, కూకట్ పల్లి నియోజకవర్గం పరధిలోని ఫతేనగర్ డివిజన్ అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతున్నదని. నియోజకవర్గంలోని మిగతా డివిజన్ లకు ఆదర్శంగా నిలుస్తున్నదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంక్షేమ సంఘంసభ్యులు అధ్యక్షుడు వరాహల స్వామి, కార్యదర్శి వెంకట్రామ నరసయ్య, శేఖర్ గౌడ్, కంచి స్వామి, సోమేష్ ,కర్ణాకర్, నాయుడు తదితరులు పాల్గొనారు.

# విద్యార్థులు తమ జీవితాన్ని సవాల్‌గా తీసుకోవాలి

**కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ తాటికొండ రమేష్**

**భీమదేవరపల్లి, విశాల భారతి:** విద్యార్థులు జీవితాన్ని సవాల్ గా తీసుకోని అంచలంచలుగా ఉన్నత స్థాయికి ఎదగాలని హనుమకొండ కేయూసి వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. మండలంలోని ముల్కనూర్ శ్రీ రామానంద తీర్థ జూనియర్ కళాశాల 35వ వార్షికోత్సవం శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఏదలాపురం మొగిలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి వైస్ ఛాన్స్లర్ తాటికొండ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఉత్తేజభరితంగా ప్రసంగించారు. భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు కుమార్తె చైర్మన్ సురభి వాణి నిర్వహిస్తున్న కళాశాల ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉందన్నారు. ఈ కళాశాలలో విద్యను అభ్యసించడం విద్యార్థులు అదృష్టంగా భావించాలని ఆయన అన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ మాట్లాడుతూ మాజీ ప్రధాని పి.వి నర్సింహారావు పుట్టి, పెరిగి విద్యను అభ్యసించారని, విద్యతోనే ఈ దేశానికి ప్రధాన మంత్రి అయ్యారని గుర్తుచేశారు. తన స్వగ్రామంలో 800 ఎకరాలు భూదానం చేసి తన దాతృత స్వభావాన్ని చాటుకున్నారని స్వామి రామానంద తీర్థ బాటలోనే పివి నరసింహారావు నడిచారని ఆయన చూపిన మార్గంలో నేను నడుస్తున్నానని విద్యార్థులతో ఆమె గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ తిరుమల బుసి, సి ఎ హుస్సేన్ భాష, డా. ఏదులాపురం తిరుపతి, పీడిశెట్టి రాజు, అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# 22న సెలవు ప్రకటించాలి

**కౌన్సిలర్ హంసరాణి కృష్ణ గౌడ్**

**మేడ్చల్ ,విశాలభారతి:** రామ జన్మభూమి అయోధ్యలో 500ఏళ్లుగా ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగాల వల్ల ఈనెల 22న అయోధ్య నగరంలో శ్రీ బాల రామచంద్రస్వామి పున ప్రతిష్ట కార్యక్రమం జరుగుతున్నందువల్ల ఈ కార్యక్రమం కొరకు భారతదేశంలోనే కాక ఇతర దేశాల వాళ్లు కూడా ఎంతో ఉత్సాహంతో ఎదురు చూస్తున్నారని భారతదేశంలోని హిందువులే కాక రాముని ఆరాధించే ఇతర మతస్థులు కూడా ఈ కార్యక్రమం కోసం ఎదురుచూస్తున్నారని మన రాష్ట్రంలో కూడా ప్రతి ఇంటికి శ్రీరాముల వారి అక్షంతలు ఆశీర్వచనంగా పంపించడం జరిగినదిని గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ ఆన్సర్ హరి కృష్ణగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22ను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సెలవు



దినంగా ప్రకటించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరడం జరుగుతుందని కౌన్సిలర్ సముద్రాల హంసరాణి కృష్ణ గౌడ్ అన్నారు.



# విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి

**తపస్ యూనియన్ సభ్యులు**

**మేడ్చల్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తపస్ మేడ్చల్ ఆధ్వర్యంలో ఈనెల 22న అయోధ్యలో శ్రీరాములవారి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతున్న సందర్భంగా దేశమంతా కూడా పండుగ వాతావరణం లాగా ఉంది కనుక కేంద్ర ప్రభుత్వం పరిధిలో నడుస్తున్నటువంటి విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినందున మన మేడ్చల్ జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు కూడా సెలవు ప్రకటించాలని కోరుతూ మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయ్ కుమారికి వినతి పత్రం అందజేసిన తెలంగాణ రాష్ట్ర తపస్ ఉపాధ్యక్షురాలు వనం పద్మ, రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, మేడ్చల్ మండల అధ్యక్షులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# నారాయణఖేడ్‌లో రామ దీక్షలు

**నారాయణఖేడ్, విశాల భారతి:** ఈ నెల 22 వ తేదీన జరుగు అయోధ్యలో నిర్మించిన ఆలయం ప్రారంభోత్సవం, రామ్ లల్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ పట్టణంలో గల 50 మంది రామభక్తులు పురోహిత సార్వభౌమ, మలమంచి గురురాజ శర్మ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు రామ దీక్ష వేసుకోవడం జరిగింది. ఈ దీక్షలో సాయి సంగమేశ్వర్, పరమేశ్వర్ ముదిరాజ్, కోటగిరి శ్రీనివాస్ విజయ్, భూషణం, పత్రి రామకృష్ణ పాల్గొన్నారు.



# మందకృష్ణ మాదిగను కలిసిన మేడ్చల్ నాయకులు

**మేడ్చల్ ,విశాలభారతి:** ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగని తన నివాసంలో మేడ్చల్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ని. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగని శాలువతో సత్కరించి ఉద్యమ అభినందనలు తెలియజేయడం జరిగిందిని తెలిపారు. మేడ్చల్ జిల్లా యువసేన అధ్యక్షులు పరశురాం మాదిగ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుపై కమిటీని వేయడం శుభపరిణామమని అన్నారు. మాదిగల కల నెరవేరే సమయం ఆసన్నమైనదని దానికి అనుగుణంగానే బిజెపి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో మాదిగ జాతి యువకులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి ఎస్సీ వర్గీకరణ పోరాటానికి తామంతా ఎప్పటికీ ముందు ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బాలకృష్ణ, రామకృష్ణ, శివ, బాల నరసింహ పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలను పరామర్శించిన సునీల్ రెడ్డి

**బాల్కొండ, విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి శనివారం పలు బాదిత కుటుంబాలను పరామర్శించారు. గత పది రోజుల క్రితం బాల్కొండ లోని మాలెం సాగర్ తండ్రి అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే బండి మల్లయ్య కూడా అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సాను భూతి వ్యక్తం చేశారు. బ్రహ్మరౌతూ రాజేందర్ సతీమణికి ఇటీవలే గుండెకు సంబంధించిన చికిత్స జరగడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి మనోదర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గున్నాల వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు గోపు ఉషన్న, మొహమ్మద్ యునుస్, కుందారం శ్రీనివాస్, కట్టెల శ్రీనివాస్ గౌడ్, వివేక్ విక్కీ, జక్క పద్మారావు,మహమ్మద్ అన్వర్, ఇమ్రాన్ ఖాన్,గోపు మహేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారులు.

# ఓటరుగా నమోదు చేసుకోవాలి

**మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు**

**మేడ్చల్ ,విశాలభారతి:** మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో ఓటర్ స్పెషల్ సమ్మరీ రివిజన్ ను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీటిఎస్ విఎన్ త్రిల్లేశ్వర్ రావు శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం నాడు కూడా ఈ స్పెషల్ సమ్మరీ రివిజన్ ఉంటుందని తేది 01.01.2024 తో 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకునే పౌరులందరు ఫార్మ్ 6 కు ఐడి ప్రూఫ్, అడ్రస్ ప్రూఫ్ జతపరిచి నూతన ఓటరు నమోదుకు కొరకు బిఎల్ఓలకు అందించాలని సూచించారు. ఓటరు ఐడి లో సవరణలు ఉంటే ఫార్మ్ 8 ద్వారా సరిచేసుకోవాలని పేర్కొన్నారు . ఈ సదవకాశాన్ని మున్సిపల్ ప్రజలంతా సద్వినియోగపరుచుకోవాలని కోరారు . ధరఖాస్తు ధారులకు ధరఖాస్తు నింపడంలో స్థానిక బిఎల్ఓలు సహాయపడతారని తెలియజేశారు.





# కార్యకర్తల సమిష్టి కృషితోనే హ్యాట్రిక్ విజయం

- పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్
- ఉస్మానగర్ నుండి చిలుకూరు బాలాజీ దేవాలయం వరకు కౌన్సిలర్ చిట్టి ఉమేష్ పాదయాత్ర

**పటాన్ చెరు, విశాలభారతి:** బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమిష్టి కృషి మూలంగానే పటాన్ చెరు నియోజకవర్గంలో గులాబీ జెండా మూడోసారి రెపరెపలాడిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్ నగర్ వార్డు కౌన్సిలర్ చిట్టి ఉమేష్ ఉస్మాన్ నగర్ హనుమాన్ దేవాలయం నుండి చిలుకూరు బాలాజీ దేవాలయం వరకు చేపట్టిన పాదయాత్రను ఎమ్మెల్యే జిఎంఆర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీతారాముల చేనేత పట్టు వస్త్రాల తయారీ పనులు ప్రారంభం

**బాల్కొండ, విశాల భారతి:** హైదరాబాద్ లోని సనత్ నగర్ లో చేనేత పట్టు వస్త్రాల తయారీ పనులను స్థానిక శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ తో కలిసి మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ ప్రారంభించారు. అయోధ్య రామ మందిరం పునర్ ప్రతిష్ట ఉత్సవాల సందర్భంగా సనత్ నగర్ శ్రీ హనుమాన్ దేవాలయంలో సీతా రామచంద్రుల వారికి సమర్పించడానికి పద్మశాలి చేనేత కళాకారులచే నియమ నిష్ఠలతో సీతారాముల వారికి పోచంపల్లి చేనేత పట్టు వస్త్రాలను తయారీ చేస్తున్నారు. తయారీ చేస్తున్నా పనులను వారు ప్రారంభించారు.





# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**పటాన్ చెరు, విశాలభారతి:** ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని భారతీ నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి అన్నారు. శనివారం భారతి నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్స్ సొసైటీ కాలనీ సొసైటీ కార్యాలయంలో కాస్మిక్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్ అండ్ న్యచురోపతి విద్యా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంపును కార్పొరేటర్ సిందు ఆదర్శ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విద్య సంస్థ నిపుణులు మాట్లాడుతూ అలసట, ఒత్తిడి, నిద్రలేమి, కీళ్ల నొప్పులు, వెన్నునొప్పి మరియు తల నొప్పి వంటి అనేక రకాల అనారోగ్యాల నుండి చాలా మంది ఉపశమనం పొందడం జరుగుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో విద్యా సంస్థ నిపుణులు మంజుల, సత్య, స్పందన, బిందు, రామచంద్రం, రవీంద్ర, దుర్గాబాయి మహిళ అధ్యక్షురాలు కల్యాణి, సెక్రెటరీ అరుణ, ప్రసన్న, అనురాధ, స్వరూప, పుష్ప, తదితరుల పాల్గొన్నారు.

# అధ్యాపకురాలు మృతి

**ఆర్మూర్, విశాల భారతి:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు లో అతిథి అధ్యపకు రాలిగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్. నిశిత ఆకస్మికంగా మృతి చెందినట్లు కళాశాల ప్రిన్సిపల్ జి. ధనవేని తెలిపారు. కళాశాలలో ఎంతో బాధ్యతగా విధులు నిర్వహించే సిహెచ్ నిషిత కొంతకాలంగా అనారోగ్య సమస్యలకు గురై, చికిత్స అనంతరం మళ్లీ కళాశాలలో చేరి విధులు నిర్వహించింది. కళాశాలలో విధులను బోధన బాధ్యతలను చక్కగా నిర్వర్తించే అధ్యాపకురాలు ఆకస్మికంగా మృతి చెందడం పట్ల తీరని ఆవేదన కలిగించిందని కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు విద్యార్థినిలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కళాశాల అతిథి అధ్యాపకురాలు సిహెచ్ నిషిత మృతికి ప్రిన్సిపల్ జి. ధనవేని, వైస్ ప్రిన్సిపల్ ఎస్. శరణ్య, అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు సంతాపం ప్రకటించి, ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.





# ఉచిత ఆన్లైన్ పరీక్షకు విశేష స్పందన

**సికింద్రాబాద్, విశాలభారతి :** సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల, హబ్సిగూడ లో టెక్స్ అకాడమీ ద్వారా విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులను అందించడానికి బి.ఎస్.సి,బి.కాం, బి.బి.ఎ విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఉచిత ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్నేహ ప్రభ మాట్లాడుతూ. ఇలాంటి ఉచిత కోర్సులు మరియు ప్లేస్‌మెంట్ అందించే డ్రైవ్‌లు విద్యార్థుల ప్రకాశవంతమైన కెరీర్‌కు ఖచ్చితంగా సహాయపడతాయని అన్నారు.

కోర్సులు పూర్తయిన తర్వాత విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తామని, టెక్స్ అకాడమీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఉద్యోగులుగా ప్రవేశాలు కల్పిస్తామని మోహన్ దాస్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ చెప్పారు.

విద్యార్థులకు కోర్సులు, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న ప్రిన్సిపాల్, యాజమాన్యానికి మోహన్‌దాస్ కృతజ్ఞతలు తెలిపారు.రవీందర్ దయాత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉచిత ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించినందుకు టెక్స్ అకాడమీకి ధన్యవాదాలు మరియు , ఎంపికైన విద్యార్థిని రూపాని మనీషాకు,ఉచిత కోర్సులు మరియు ఉద్యోగాలకు ఎంపికైనందుకు అభినందనలు తెలిపారు .కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్లు శశికళ, సరస్వతి, మైత్రి , జరీనా లావణ్య విజయలక్ష్మి, సబిత,నవిత, భావన, విద్యార్థులు పాల్గొన్నారు.




# నవనాథపురం ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- జర్నలిస్టులసమస్యలను పరిష్కరిస్తా
- నూతన అధ్యక్షులు నరేందర్ వెల్లడి

**ఆర్మూర్, విశాల భారతి:** ఆర్మూర్ మండల నవనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా మంచిర్యాల నరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా ఉపాధ్యక్షులు పార్థం సంజీవ్ ప్రకటించారు. శనివారం పట్టణంలోని ఆర్మూర్ ప్రెస్ క్లబ్, భవనంలో విలేకరుల సమావేశం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా మంచిర్యాల నరేందర్, ఉపాధ్యక్షులుగా ముద్రకోల వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, సంయుక్త కార్యదర్శిగా సూరిబాబు, కోశాధికారిగా గోజుర్ మహిపాల్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాజేందర్, కార్యవర్గ సభ్యుడుగా దినేష్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ఉపాధ్యక్షుడు పార్థం సంజీవ్ విన్సెంట్ షికారి శ్రీనివాస్ లు ప్రకటించారు. ఈ సందర్భంగా నవనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన మంచిర్యాల నరేందర్ మాట్లాడుతూ విలేకర్ల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. జర్నలిస్టుల సమస్యలపై నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి , కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



# థాంక్యూ మినిస్టర్ సార్

**భీమదేవరపల్లి, విశాల భారతి:** హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ వైపు వెళ్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్గ మధ్యలో ఇందిరానగర్ మోడల్ స్కూల్ విద్యార్థులు రోడ్డుపై బస్ కోసం వేచిఉన్న విద్యార్థులను చూసి కాన్వాయ్ ఆపి వారితో మాట్లాడి వారికి జరుగుతున్న అసౌకర్యలను తెలుసుకొని వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమయానికి బస్ లు నడిపేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే స్కూల్ ప్రిన్సిపాల్ కూడా విద్యార్థులు బస్ ఎక్కే వరకు వారి భద్రతగా ఉండాలి అని కోరారు. పొన్నం యాక్షన్ కి వచ్చిన రియాక్షన్ కి పిల్లలు థాంక్యూ మినిస్టర్ సార్ అని అన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com






# అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా ఫిల్మ్ నగర్ టెంపుల్ లో ప్రత్యేక పూజలు

పాలక మండలి చైర్మన్
డా.మంచు మోహన్ బాబు

500 ఏళ్ల నాటి భారతీయుల కల నెరవేరబోతోంది. జనవరి 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని దేశం మొత్తం ఓ పండుగలా జరుపుకుంటోంది. ఈ వేడుకకు దేశంలో సినీ, రాజకీయా, క్రీడా ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం పంపింది. అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా మంచు మోహన్ బాబు ఫిల్మ్ నగర్ దైవ సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డా.మోహన్ బాబు గారు మీడియాతో ముచ్చటిస్తూ... 'ఫిల్మ్ నగర్‌లో దైవ సన్నిధానం దేవాలయాన్ని అందరి కోసం నిర్మించాం. ఈ మధ్య కాలంలో దైవ సన్నిధానం పాలక మండలి చైర్మన్ పదవిని నేను స్వీకరించాను. ఈ దేవాలయంలో 18 మూర్తులు, 15 మంది బ్రాహ్మణోత్తములున్నారు. ఈ దైవ సన్నిధానంలో కోరిన కోరికలన్నీ తీరుతున్నాయని భక్తులు చెబుతున్నారు. తిరుపతి వెంకటేశ్వర స్వామి, సాయి బాబా, శ్రీరాముడు, లక్ష్మీ నరసింహ స్వామి, సంతోషిమాత ఇలా 18 మంది దేవతలు ఇక్కడ కొలువై ఉన్నారు. ఇది రాముడు పుట్టిన దేశం.. ఇది రామ జన్మ భూమి అని ప్రపంచానికి చాటి చెప్పేలా చేశారు మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ. అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభిస్తూ ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన ప్రధాని మోదీ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. జనవరి 22న జరిగే రామ మందిర ప్రారంభోత్సవానికి ఊరూరా తరలి వెళ్తున్నారు. నాకు కూడా అహ్వానం అందింది. కానీ భద్రతా కారణాల దృష్ట్యా రాలేకపోతోన్నాను క్షమించమని ఉత్తరం రాశాను. రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా దైవ సన్నిధానంలోనూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. అందరూ వచ్చి విజయవంతం చేయండి' అని కోరారు.



## విశ్వక్‌సేన్ లాంచ్ చేసిన 'కిస్మత్' టైటిల్ సాంగ్

నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, విశ్వ దేవ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న బడ్డీ కామెడీ ఎంటర్ టైనర్ 'కిస్మత్'. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అఖీరా ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో శ్రీనాథ్ బాదినేని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టీజర్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా మాస్ కా దాస్ హీరో విష్వక్‌సేన్ 'కిస్మత్' టైటిల్ సాంగ్ ని లాంచ్ చేశారు. మార్క్ కె రాబిన్ ఈ పాటని స్ట్రయికింగ్ అండ్ క్యాచి నెంబర్ గా కంపోజ్ చేశారు. హేమచంద్ర పాడిన ఈ పాటకు భాస్కరబట్ల అందించిన సాహిత్యం ఆకర్షణీయంగా వుంది. 'లెఫ్టే రైటై పోవచ్చు, లైఫే టర్న్ అయిపోవచ్చు, పట్టుకుంటే మన్ను కూడా మలబార్ గోల్డ్ అయిపోవచ్చు, జాక్ పాటే పాటే తగలొచ్చు.. ట్రాకే మారిపోవచ్చు, ఎపుడూ చూడని వండర్స్ వన్ డేలోనే జరగొచ్చు" పాటలో వినిపించిన ఈ లిరికల్ లైన్స్ కథ, పాత్రలని ఆసక్తికరంగా తెలియజేసేలా వున్నాయి.

## కృతి సనన్ బోల్డ్ షో!

న్యూస్ లైన్ సినిమా: బాలీవుడ్ బ్యూటీ కృతిసనన్ తెలుగులో మహేష్ బాబు సరసన హీరోయిన్ గా వన్ నేనొక్కడినే సినిమాతో పరిచయం అయ్యింది. ఆ మూవీ అంతగా అకటుకోలేదు. ఆ తర్వాత నాగ చైతన్యతో దోచేయ్ సినిమాలో నటించింది. ఈ మూవీ కూడా అంతగా అకట్టుకోకపోవడంతో ఈ భామ బాలీవుడ్‌కి చేకెసింది. బాలీవుడ్‌లో సార్ట్ హీరోయిన్‌గా దూసుకుపోతుంది. తాజాగా పాన్ ఇండియా సార్ట్ ప్రభాస్ సరసన అదిపురుష్ మూవీలో నటించింది. ఈ అమ్మడు సీత పాత్రకు మంచి రెస్పన్స్ వచ్చింది. షాహిద్ కపూర్ సపసన హీరోయిన్‌గా నటించిన లేటెస్ట్ మూవీ తెరి బాతొన్ మె ఐసా ఉజా జియా ఈ సినిమా ఫిబ్రవరి 9న విడుదల కాబోతుంది. మూవీ మేకర్స్ ప్రమోషన్స్ జోరుగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రమోషన్స్‌లో ఉన్న కృతి తాజాగా ఫోటోషూట్‌టో దిగిన ఫిక్స్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. అయితే ఈ పోటోలు ప్రస్తుతం నెట్టింటా వైరల్ అవుతున్నాయి. మినీ బ్లాక్ డ్రెస్‌లో టాప్ గ్లామర్‌తో పాటు డీప్ థైస్ అందాలు చూపిస్తూ మతిపోగొడుతుంది. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు అమ్మడు గ్లామర్‌కు సలామ్ కొడుతున్నారు.







## 'ఊరు పేరు భైరవకోన' సాంగ్‌కు 100 మిలియన్ +వ్యూస్

హీరో సందీప్ కిషన్, ట్యాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ ల మోస్ట్ అవైటెడ్ ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరు పేరు భైరవకోన'. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తుండగా, ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర సగర్వంగా సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. ఇప్పటికే విడుదలైన ఊరు పేరు భైరవకోన ప్రమోషనల్ కంటెంట్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం కోసం శేఖర్ చంద్ర కంపోజ్ చేసిన ఆల్బమ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఇందులో 'నిజమే నే చెబుతున్నా' పాట సెన్సేషనల్ వైరల్ హిట్ గా నిలిచింది. స్టార్ సింగర్ సిద్ శ్రీరాం పాడిన ఈ పాట అందరినీ మెస్మరైజ్ చేసింది. శ్రీమణి అందించిన సాహిత్యం మరింత ఆకర్షణగా నిలిచింది. ఈ పాటలో సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ బ్యూటీఫుల్ కెమిస్ట్రీ ప్రేక్షకులని కట్టిపడేసింది. ఈ సాంగ్ రిలీజ్ అయినప్పటికీ నుంచి అన్నీ సోషల్ మీడియా మ్యూజిక్ ఫ్లాట్ ఫార్మ్స్ లో టాప్ ట్రెండింగ్ అలరిస్తోంది. తాజాగా ఈ పాట 100 మిలియన్+ వ్యూస్ ని క్రాస్ చేసి రికార్డ్ క్రియేట్ చేసింది. బిగ్గెస్ట్ హిట్ గా అలరిస్తున్న ఈ పాటని బిగ్ స్క్రీన్స్ పై చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ఆడియన్స్.

## సింగిల్ టేక్‌లో 34 నిమిషాల షాట్

ఆపిల్ బ్యూటీ హన్సిక కొంత కాలంగా సోలో ప్రయత్నాలు జోరుగా చేస్తోన్న సంగతి తెలిసిందే. అమ్మడు ఎక్కువగా లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతోనే ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. ఈ విషయంలో మాత్రం హన్సిక జయాపజయాలతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తోంది. దర్శక-నిర్మాతలు కేవలం ఆమెని మాత్రమే బేస్ చేసుకుని సినిమాలు తీస్తున్నారు. వచ్చిన అవకాశాల్ని అమ్మడు తెలివిగా సద్వినయోగం చేసుకుం టుంది. స్టార్ హీరోలతో ఆఫర్లు కూడా తగ్గిన నేపథ్యంలో ఈ రకమైన ప్రాజెక్ట్ లతో బిజీ బిజీగా గడుపుతోంది. తెలుగులోనూ వాటిని అనువాద రూపంలో రిలీజ్ అయ్యేలా చూసుకుంటుంది. ప్రస్తుతం అమ్మడు `105 మినిట్స్` అనే సినిమాలో నటిస్తోంది. హన్సిక మెయిన్ లీడ్ లో తెరకెక్కుతోన్న చిత్రమిది. రాజు దుస్సా అనే కొత్త కుర్రాడు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవలే ఈసినిమా ప్రచార చిత్రాలు కూడా రిలీజ్ అయ్యాయి. వాటితో సినిమాకి మంచి బజ్ క్రియేట్ అవుతుంది. ఇక ఈ సినిమా కోసం హన్సిక బాగానే కష్టపడినట్లు తెలుస్తోంది. 34 నిమిషాల ఒక షాట్ ని కేవలం సింగిల్ టేక్ లోనూ లాక్ చేసింది. అందుకోసం అమ్మడు ఏకంగా 8 రోజుల పాటు ప్రత్యేకంగా రిహార్సల్స్ చేసిందిట. సింగిల్ టేక్ లో షాట్ ఒకే అయిందంటే? దాని వెనుక తానెంత కష్టపడిందన్నది రివీల్ చేసింది. ఇలాంటి ప్రయోగాత్మక చిత్రం చేయడం నా కెరీర్ కి రావడం అదృష్టంగా భావిస్తున్నాను.



## గేమ్ స్టార్ట్ చేసాం..మా గేమ్ ను ప్రేక్షకులే గెలిపించాలి : గీతానంద్

గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. సీనియర్ నటులు మధుబాల, ఆదిత్య మీనన్ శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషించారు. కస్తూరి క్రియేషన్స్ అండ్ గోల్డెన్ వింగ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి ఈ సినిమాను నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 2న గ్రాండ్ గా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాదులోని ప్రసాద్ లాబ్స్ లో ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత రవి కస్తూరి మాట్లాడుతూ..." ఇది నా ఫస్ట్ ప్రాజెక్ట్. నేను ఆస్ట్రేలియాలో ఉంటాను. గీతానంద్ నా క్లాస్మేట్. ఏదో ఒక రోజు సినిమా తీద్దామని అనుకున్నాం. మంచి కథతో ఈ సినిమాను స్టార్ట్ చేసాం. ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా దీన్ని రూపొందించాం. ప్రతి విషయంలో క్వాలిటీ ఉండేలా చూసుకున్నాం. ప్రేక్షకులను ఎంగేజ్ చేసేలా సినిమా ఉంటుంది. నవాబ్ గ్యాంగ్స్ అద్భుతమైన పాటలు ఇచ్చారు అవి అందర్నీ ఆకట్టుకునేలా ఉంటాయి. ఇలాంటి కథ ఇప్పటివరకు తెలుగు తెరపై రాలేదు". అని చెప్పారు. దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ " కమర్షియల్ స్క్రిప్ట్ ని రా అండ్ రస్టిక్ గా చిత్రీకరించాను. పూరి జగన్నాథ్ ఫ్యాన్ గా ఈ సినిమాను డైరెక్ట్ చేశాను. ఈ చిత్రంలో పాత్రలన్నీ గ్రే షేడ్‌లో ఉంటాయి. ప్రతి పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది. తన జీవితాన్ని చాలించాలనుకునే ఓ వ్యక్తి ,రియల్ టైమ్ సైకలాజికల్ గేమ్‌లోకి ఎలా ప్రవేశించాడు? గేమ్‌లోని టాస్క్‌ను ఎలా స్వీకరించాడు? అసలు ఆ గేమ్ ఎంచుకోబడడానికి కారణం ఏమిటి? ఈ గేమ్ ఎవరు ఆడిస్తున్నారు? అనే అంశాలతో 'గేమ్ ఆన్' సినిమా తెరకెక్కింది. యాక్షన్, రొమాన్స్, ఎమోషన్స్ ఆకట్టుకుంటాయి. కచ్చితంగా మా సినిమా ప్రేక్షకులకు కొత్త ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. ఈ జర్నీలో చాలా ఛాలెంజెస్ ఫేస్ చేసాం. గీతానంద్ ఇంటెన్స్ క్యారెక్టర్ చేశాడు. మధు బాల గారు చాలా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేశారు. రెగ్యులర్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ కాకపోయినా ఫ్యామిలీ డార్క్ ఎమోషన్స్ ఉంటాయి" అని చెప్పారు. గీతానంద్ మాట్లాడుతూ.." ట్రైలర్ లో చూసింది 10% మాత్రమే. ఈ సినిమా కోసం చాలా రీసెర్చ్ చేశాం. మంచి కాన్సెప్ట్ రాసుకుని దానికి కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించాం. ఇదొక హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా. గేమింగ్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గా పని చేసే ఒక ఎంప్లాయ్ జీవితంపై విరక్తి చెంది ఒక గేమ్ లో పడితే ఎలా ఉంటుందనేది ఈ సినిమాలో ఆసక్తికరంగా చూపించాం. మధుబాల గారు ఆదిత్య మీనన్ గారు ఇందులో ఉండడం ఈ సినిమా నెక్స్ట్ లెవెల్ కు వెళ్లింది. గేమ్ స్టార్ట్ చేసాం . మా గేమ్ ను ప్రేక్షకులే గెలిపించాలి. ఈ సినిమా తర్వాత మా తమ్ముడైన డైరెక్టర్ దయానంద్ యాక్షన్ డైరెక్టర్ గా పేరు తెచ్చుకుంటాడు. నేను కూడా నటుడుగా పేరు తెచ్చుకోవాలని ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను" అని చెప్పారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.